
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 141 ISSUE NO : 141 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం,నవంబర్,25,2025 Tuesday,November,25,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4/-



## బాలీవుడ్ దిగ్గజ నటుడు

# ధర్మేంద్ర మృతి

## కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స

**ముంబై, నవంబర్24 :** భారత సినిమా రంగానికి అపారమైన సేవలందించిన బాలీవుడ్ లెజెండరీ నటుడు ధర్మేంద్ర కన్నుమూశారు. సోమవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ ప్రముఖులు ధర్మేంద్ర నివాసానికి చేరుకుని నివాళి అర్పించారు. 89 ఏండ్ల ధర్మేంద్ర గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పది రోజుల క్రితం ముంబై లోని క్యాండి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. అప్పటినుంచి ఆయన ఆరోగ్యంపై రకరకాలుగా వార్తలు వచ్చాయి. ఇప్పటి వరకూ ధర్మేంద్ర వెంటిలేటర్‌పై ఉన్నారంటూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వచ్చాయి. ఆరోగ్యం క్షీణించడంతో తుదిశ్వాస విడిచినట్లు తెలుస్తోంది. 1958లో దిల్ బీ తేరా హమ్ బీ తేరే చిత్రంతో తెరంగేట్రం చేసిన ధర్మేంద్ర, తన కెరీర్‌లో 'షోలే', 'చుప్కే చుప్కే', 'ధర్మ్ వీర్', 'సీతా ఔర్ గీత', 'యాదోం కి బారాత్' వంటి ఎన్నో క్లాసిక్ సినిమాలతో అభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. స్క్రీన్‌పై తన పవర్‌ఫుల్ డైలాగ్ డెలివరీ, మాస్ అప్పీల్, అద్భుతమైన స్టైల్‌తో ఆయనకు అభిమానులు 'హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్' అనే బిరుదు ఇచ్చారు. ధర్మేంద్ర నటించిన తాజా చిత్రం 'ఇక్కీస్ విడుదలకు సిద్ధమవుతోంది. ఇది పరమవీర చక్ర గ్రహీత లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితకథ ఆధారంగా రూపొందిన చిత్రం. ఇందులో ఆయన హీరో తండ్రి పాత్రలో కనిపించనున్నారు

## భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా

# జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం



## శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని

**ఢిల్లీ:** భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జస్టిస్ సూర్యకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పదవీకాలం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తన సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' లో పేర్కొన్నారు. అనేక చారిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామి అయిన జస్టిస్ సూర్యకాంత్, ఇటీవలి సంప్రదాయానికి భిన్నంగా దైవసాక్షిగా హిందీలో ప్రమాణం చేయడం విశేషం. అనేక చారిత్రాత్మక తీర్పుల్లో భాగస్వామి అయిన జస్టిస్ సూర్యకాంత్, ఇటీవలి సంప్రదాయానికి భిన్నంగా దైవసాక్షిగా హిందీలో ప్రమాణం చేయడం విశేషం.

- భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం
- కొత్త సీజేఐకి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని నరేంద్ర మోదీ
- 2027 ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగనున్న జస్టిస్ సూర్యకాంత్
- పలువురు కేంద్ర మంత్రులు, విదేశీ న్యాయమూర్తులు హాజరు





## చదువుతోనే ఉజ్వల

# భవిష్యత్

- కొడంగల్‌లో రూ.5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్
- తెలంగాణ నోయిడాగా కొడంగల్ అభివృద్ధి
- అభివృద్ధికి ప్రజలంతా అండగా నిలవాలి
- గతంలో ఎవరు సిఎం ఉన్నా కొడంగల్‌ను పట్టించుకోలే
- సొంత నియోజకవర్గం పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి

**కొడంగల్,తెలంగాణ దిశ :** మన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని, అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ఆకాంక్ష అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉన్నా ఇటువైపు చూడలేదని, అందుకే మీరిచ్చిన ఈ అవకాశంతో కొడంగల్‌ను తీర్చిదిద్ద బోతున్నానని అన్నారు. అభివృద్ధితో వెళతున్న తనకు మీ ఆశర్వాదంతో మద్దతు పలకాలన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభమవుతాయి. నియోజకవర్గం లో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయ బోతున్నాం అని అన్నారు. కొడంగల్ లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడ దన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం అందిస్తున్నామన్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని చెప్పారు. సొంత నియోజకవర్గం కొడంగల్ పర్యటనకు వెళ్లిన రేవంత్ రెడ్డి.. అక్కడి అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించారు. మిడ్‌డే మీల్స్ కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలన్నారు. కొడంగల్‌లో రూ. 5వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నాం. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తాం అని ప్రకటించారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశాం. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశాం అని వెల్లడించారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నాం. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం అని అన్నారు. మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తాం.



# పుచ్చ లేచిపోద్ది...

## మాజీ మంత్రికి కవిత వార్నింగ్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తన తండ్రి వయసువారని ఇన్నాళ్లు తాను ఏమి అనలేదని కానీ ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడితే ఊరుకునేది లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తనను ఉద్దేశించి పుచ్చువంకాయ, సచ్చు వంకాయ అని నిరంజన్ రెడ్డి మాట్లాడుతున్నారట.. ఇన్నాళ్లు మీ వయసుకు గౌరవిం చాను. ఇంకో సారి నాపై పిచ్చి పిచ్చిగా మాట్లాడితే పుచ్చ లేచిపోతుందని ఘాటుగా హెచ్చరించారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా వనపర్తిలో మీడియాతో మాట్లాడిన కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు.



## జిహెచ్ఎంసి ఎన్నికలకు సిద్దంగా

# ఉండాలి

## - గరేటర్ కార్పోరేటర్లకు కెటిఆర్ దిశానిర్దేశం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** జీహెచ్ఎంసీ ఎన్నికలు ఎప్పుడుపెట్టినా సిద్ధంగా ఉండాలనిబీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. అలాగే మంగళవారంజరిగే కౌన్సిల్ సమావేశంలో బల్దియాలోని సమస్యలు ప్రస్తావించాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక భూముల అమ్మకంపై నిలదీయాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ నేతలతో కేటీఆర్సమావేశమయ్యారు. జీహెచ్ఎంసీ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులతో తెలంగాణ భవన్‌లో భేటీ అయ్యారు. మంగళవారం జరుగనున్న గ్రేటర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం, జీహెచ్ఎంసీ ఎన్నికలకు సన్నద్ధతపై చర్చించారు.



## తమిళనాడు, పుదుచ్చేరిలో..

# భారీ వర్షాలు

## స్కూళ్లు, కాలేజీలకు సెలవు

- తమిళనాడులోని దక్షిణ, డెల్టా జిల్లాలకు ఐఎండీ భారీ వర్ష హెచ్చరిక
- దక్షిణ అండమాన్ సముద్రంలో అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం
- చెన్నైలో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- రాష్ట్రంలో పలుచోట్ల సాధారణం కంటే పెరిగిన రాత్రి ఉష్ణోగ్రతలు

**ఢిల్లీ:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాలను శనివారం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు ముంచెత్తుతున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమై జనజీవనం స్తంభించింది. ఈ నేపథ్యంలో సోమవారం పుదుచ్చేరి, కారైకాల్‌లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల లకు సెలవు ప్రకటిస్తున్నట్లు ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఎ. నమశ్శివాయం వెల్లడించారు.

# హైదరాబాద్ సూర్యాపేట వరకు వంద కిమీ రన్ విజయవంతం..

## - మోవెంబర్ లా అల్ట్రా 2025





**హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ దిశ)** :పురుషుల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన 'మోవెంబర్ లా అల్ట్రా 2025' రన్ విజయవంతంగా ముగిసింది. రే ఆఫ్ సన్‌షైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 22, 23 తేదీల్లో హైదరాబాద్ నుంచి సూర్యాపేట వరకు వంద కిలోమీటర్ల దూరాన్ని రన్నర్లు పూర్తి చేశారు. ఈ ఏడాది ఐదవ ఎడిషన్‌గా నిర్వహించిన ఈ రన్‌లో 15 మందికి పైగా రన్నర్లు వివిధ దూరాల్లో పాల్గొనడం విశేషం. పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద తెలంగాణ రన్నర్స్ కోశాధికారి హరీష్ రెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ ప్రతినిధి సందర్ నాగేష్ ఫ్లాగ్ ఆఫ్ చేశారు. ఈ కార్యక్రమంలో రే ఆఫ్ సన్‌షైన్ ఫౌండేషన్ ట్రస్టీ, తెలంగాణ రన్నర్స్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ తాడూరి, ప్రగ్నాపూర్‌కు చెందిన నిఖిల్ రెడ్డి వంద కిమీ మొత్తం దూరాన్ని పూర్తి చేసి ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. పురుషుల ఆరోగ్యంపై సమాజంలో పెద్దగా చర్చ జరగకపోవడం వల్లే ఈ కార్యక్రమాన్ని ఫౌండేషన్ తొలి ఈవెంట్‌గా ప్రారంభించామని ఫౌండేషన్ ట్రస్టీ జోహన్న తెలిపారు. పురుషులు మౌనంగా ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలకు వెలుగు చూపడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. క్లెర్వ్ మద్దతుతో నిర్వహించిన ఈ ఉత్సాహభరిత రన్, ప్రపంచవ్యాప్తంగా జరిగే "మోవెంబర్" ఉద్యమానికి అంకితం చేయబడింది.

నవంబర్ నెలలో మీసం పెంచి పురుషుల ఆరోగ్యం, ప్రొస్టేట్ కేన్సర్‌పై అవగాహన కల్పించే ఈ ఉద్యమానికి వేలాది మంది ప్రపంచవ్యాప్తంగా మద్దతు తెలుపుతున్నారు. ఈ ఏడాది మూడు లక్షల రూపాయల విరాళం సేకరించడం లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సేకరించిన నిధులన్నీ ప్రొస్టేట్ కేన్సర్ బాధితుల కోసం రే ఆఫ్ సన్‌షైన్ ఫౌండేషన్ ద్వారా వినియోగించనున్నట్లు తెలిపారు. గత ఎడిషన్‌లలో 50-60 కిమీ రన్‌ల ద్వారా కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి రూ.50 వేలు సేకరించినట్లు తెలిపారు. సమాజంలో ఐక్యత, సహకారం, ఆరోగ్యంపై శ్రద్ధ పెంపొందించడమే ఈ రన్ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు.

పురుషుల ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మీసం పెంచడం, విరాళాలు అందించడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి మార్గాల్లో ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "మీ సహాయం ఎవరికో కొత్త ఆశను ఇస్తుంది. చిన్న విరాళం కూడా పెద్ద మార్పును తీసుకురాగలదు" అని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. మరిన్ని వివరాల కోసం : శ్రీకాంత్ తాడూరి – 9949113931, మెయిల్ [rosf .jost@g mail. com](mailto :rosf. jost@gmail.com) 'మోవెంబర్' భావజాలానికి అనుగుణంగా – ఆరోగ్యం కోసం అందరం ముందుకు రండీ అన్న పిలుపుతో ఈవెంట్ ముగిసిందని తెలిపారు.



# సేంద్రీయ వ్యవసాయం చేస్తే మరో 4 వేలు అదనం

**అదిలాబాద్,తెలంగాణ దిశ :**రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెట్టబడి సాయంగా వివిధ రకాల పథకాల ద్వారా డబ్బులను అందిస్తున్నాయి. అంతే కాకుండా.. పంట నష్టం జరిగితే పరిహారం.. ప్రకృతి వైపరీత్యా ల కారణంగా పంట నష్టపోతే.. బీమాను కల్పిస్తున్నారు. అయితే వ్యవసాయం పంటలకు చీడ పీడల నుంచి రక్షణకు ఎక్కువగా కెమిక ల్స్ ఉపయోగిస్తున్నారు. దీనివల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలా కాకుండా.. రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది.రైతులకు పెట్టుబడి సాయం, పంట నష్టానికి పరిహారం, బీమా వంటి పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. అయినప్పటికీ.. రైతులు పంటలను తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షించుకోవడానికి ఎక్కువగా రసాయన ఎరువులను వాడుతున్నారు. ఈ రసాయనాల వల్ల నేల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా, మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ సమస్యకు పరిష్కారంగా.. ప్రభుత్వాలు రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నాయి.

# డ్రగ్స్, గంజాయి రహిత తెలంగాణ కోసం కృషి : పట్నం మహేందర్ రెడ్డి





**ఉప్పల్, నవంబర్ 24, (తెలంగాణ దిశ)** :డ్రగ్స్, గంజాయి రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కోరారు. సోమవారం నాచారం, ఘట్ కేసర్ లలో నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మేడ్చల్ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి, ఎక్సైజ్ ఈఎస్ నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం రాష్ట్రంలో 14 కొత్త పోలీస్ స్టేషన్లను మంజూరు చేసిందన్నారు. వీటిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తొమ్మిది పోలీస్ స్టేషన్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. మల్కాజిగిరి సర్కిల్ కోసం కాప్రా (ఘట్కేసర్) అల్వాల్ (మల్కాజిగిరి) ఉప్పల్ (నాచారం) మేడ్చల్ సర్కిల్ పరిధిలో కొంపల్లి (కుత్బుల్లాపూర్) కూకట్ పల్లి (బాలనగర్) అలాగే సరూర్ నగర్ సర్కిల్ లో మీర్ పేట్, పెద్ద అంబర్ పేట, అలాగేశంషాబాద్‌సర్కిల్ లో గండిపేట్, కొండాపూర్ లలో కొత్త ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ రహిత తెలంగాణను సాధించుకుందా మన్నారు. వీటి నియంత్రించేందుకు వీటి మూలాలను సమూలంగా నిర్మూలించేందుకు ఎక్సైజ్ వ్యవస్థ మరింత బలోపేతం చేయడం అవసరమన్నారు. మద్యం అక్రమ రవాణా, కల్తీ నివారించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. గంజాయి డ్రగ్స్ తదితర వాటి నివారణ కోసం ఎక్సైజ్ శాఖ నిరంతరం కృషి చేయాలన్నారు.

కొత్తగా మంజూరైన ఆఖరి స్టేషన్ల భవనాల కోసం స్థలాలు, భవన నిర్మాణం కోసం నిధులను మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డిని సంప్రదించి మంజూరు చేయిస్తామన్నారు. విద్యార్థులు, యువత మత్తు పదార్థాలు డ్రగ్స్ కు దూరంగా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన సూచించారు.

# ప్రతి ఒక్కరూ దేశం కోసం, ధర్మం కోసం, జీవించాలి: ఎన్ వివిఎస్ఎస్ ప్రభాకర్





**కుషాయిగూడ, నవంబర్ 24, (తెలంగాణ దిశ)** :భారతీయ జనతా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు వందేమాతరం కు 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం కుషాయిగూడలోని సరస్వతి శిశు మందిర్ లో వందేమాతరగీతం సామూహిక గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వివిఎస్ఎస్. ప్రభాకర్ ముఖ్య అతిథి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటర్జీ గొప్పతనాన్ని వివరించారు. దేశ స్వతంత్ర సమరయోధులను గుర్తుచేస్తూ దేశ అభివృద్ధికి ప్రతిఒక్కరుకూడా కృషి చేయాలని కోరారు. ప్రతిఒక్కరూ దేశం కోసం, ధర్మం కోసం, జీవించాలని విద్యార్థులకు మార్గం దర్శనం చేసారు. వందేమాతరం కార్యక్రమ కన్వీనర్ సహదేవగౌడ్, కో కన్వీనర్ రాజేష్ వంశరాజు,పర్యవేక్షణలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు రాధిక, రైల్వే బోర్డు సభ్యులు ఎం.లక్ష్మణ్ గౌడ్ బిజెపి నాయకులు ఉప్పల్ అసెంబ్లీ మీడియా సెల్ కన్వీనర్ తాళ్ల ఆనంద్ గౌడ్, నర్సింగ్ రావు జిల్లాకౌన్సిల్ సభ్యులు ఇస్లావత్ హరి నాయక్, లక్ష్మినారాయణ, శ్రీకాంత్, గణేష్ గౌడ్, శివ ప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నూతన అధ్యక్ష కార్యదర్శులకు ఘనంగా సన్మానం





**ఏఎస్ రావునగర్, నవంబర్ 24, (తెలంగాణ దిశ)** :బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన కాసం మహిపాల్ రెడ్డి, పెద్దాపురం కుమారస్వామిలను సోమవారం పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆలయ కమిటీ వారిని ఘనంగా సన్మానించింది. అదే విధంగా మరొక కార్యక్రమంలో పార్టీ నేతలు పడాల ఆనంద్ చారి, షేక్ అబ్దుల్ రహీమ్ తదితరులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఎన్నికలకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని అన్నారు.

# హనుమాన్ విగ్రహానికి మల్లన్న యాదవ సంఘం విరాళం





**కుషాయిగూడ, నవంబర్ 24, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ బస్టాండ్ లో హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న భారీ హనుమాన్ విగ్రహ నిర్మాణ పనులకు శ్రీ మల్లన్న యాదవ సంఘం (కుషాయిగూడ) సభ్యులు ఔదార్యాన్ని చూపారు. సంఘం అధ్యక్షులు శీలం అనిల్ యాదవ్, ముఖ్య సలహాదారుడు గుంటి ఆంజనేయులు సోమవారం రూ.51,116 విరాళాన్ని సమితికి అందజేశారు. ఈ సందర్భంగా హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి కన్వీనర్ చల్లా ప్రభాకర్ మాట్లాడుతూ విగ్రహ నిర్మాణంలో భాగంగా గర్భాలయం, ముఖ ద్వారం వంటి కీలక పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. భక్తుల సహకారంతో ఈ దేవాలయ నిర్మాణ కార్యక్రమం మరింత శీఘ్రంగా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విగ్రహ నిర్మాణానికి ప్రతి భక్తుడు తన వంతు సహాయాన్ని అందించాలని కోరారు. మల్లన్న యాదవ సంఘం చేసిన విరాళాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అదే విధంగా నిర్మాణ కార్యక్రమంలో సహకరిస్తున్న కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్, బజరంగ్ దళ్ కుషాయిగూడ సభ్యులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు యావపురం రవి, పనగట్ల చక్రపాణి గౌడ్, తాళ్ల ఆనంద్ గౌడ్, ఆర్. వెంకులు, పాండాల గణేష్ గౌడ్, దయానంద్, పిట్టల రాజు, లక్ష్మణ్ గౌడ్, రామకృష్ణతో పాటు మల్లన్న యాదవ సంఘం సభ్యులు ఏ. కృష్ణ యాదవ్, జి. శ్రీనివాస్ యాదవ్, బి. గోపాల్ యాదవ్, జె. రవి యాదవ్, జి. గోపాల్ యాదవ్, ఎం. స్వామి యాదవ్, జై రమేష్ యాదవ్, నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి శివనగర్ లో సీసీ రోడ్డు పనుల పరిశీలన



**చర్లపల్లి, నవంబర్ 24, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి డివిజన్ పరిధిలోని వాసవి శివనగర్ లో రూ. 40 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బిఆర్ఎస్ డివిజన్ పార్టీ అధ్యక్షులు నేమూరీ మహేష్ గౌడ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, కాలనీ అధ్యక్షులు పంజాల శ్రీనివాస్ గౌడ్, కనకరాజ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, జోన్ల వేణుగోపాల్ రెడ్డి, శ్రీశైలం, ఎంకిరాల నరసింహ, అనంద్ రాజ్ గౌడ్, శ్రీనివాస్ నాయక్, బాలరాజు, పరశురామ్, వెంకటేష్, సాయిబాబా, ప్రసాద్ రెడ్డి, లోకనత్, వినాయ్, పాషా, రహీం తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కమిషనర్ ను మార్చాలని కోరుతూ ప్రజావాణిలో ఫిర్యాదు

**కుత్బుల్లాపూర్, నవంబర్ 24, (తెలంగాణ దిశ)** :నిజాంపేట మున్సిపల్ కమిషనర్ ను మార్చాలంటూ పలువురు వ్యక్తులు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ లో అవినీతి తీవ్ర స్థాయిలో జరుగుతుందని నిజాంపేటకు చెందిన ఆకుల సతీష్ జిల్లా ఉప కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కు ఐఏఎస్ అధికారిని కమిషనర్ గా నియమించాలని ఆయన కోరారు. అలాగే హిందువుల స్మశాన వాటిక కోసం 3.20 ఎకరాల స్థలానికి కేటాయించాలని, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మినీ స్టేడియం కు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఆయన అభ్యర్థించారు.



# గణేష్ నగర్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల పరిశీలన



**చర్లపల్లి, నవంబర్ 24, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీ సాయి గణేష్ నగర్ లో రూ. 19 లక్షల వ్యయంతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు నేమూరీ మహేష్ గౌడ్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం చర్లపల్లి డివిజన్ అభివృద్ధికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్ని విధాలా కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు దప్పు గిరిబాబు, కనకరాజ్ గౌడ్, నర్సింహ, అనంద రాజ్, రెడ్డి నాయక్,బాలరాజు, అనిల్, శ్రీశైలం, శ్రీనివాస్ నాయక్, సాగర్ గౌడ్, రము, వెంకటేష్, సాయిబాబా,శేఖర్, రఘు, పాషా, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## క్రికెట్ మైదానం నుంచి ఉగ్రవాద శిబిరాల వరకు

భారత్– పాకిస్తాన్.. రెండూ దాయాది దేశాలే.. ఒకే తాను ముక్కలే.. కానీ ఏడు దశాబ్దాలుగా ఇరు దేశాల మధ్య శత్రుత్వం కొనసాగుతోంది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వైరం ఏటా పెరుగుతోంది. ఈ ఏడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ వైరం మరింత పెరిగింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్.. భారత్ తలుచుకుంటే చరిత్ర పటంలో మిగలదు. కానీ, అక్కడి పాలకులు, ఉగ్రవాదులు పాకిస్తానీల కు అణువనువునా విద్వేషం పెంచి పోషిస్తున్నారు. భారత వ్యతిరేకులుగా మారుస్తున్నారు. ఇందుకు తాజా నిదర్శనం ఆసియా కప్ 2025 సూపర్ 4లలో భాగంగా సెప్టెంబర్ 21న జరిగిన భారత్?పాకిస్తాన్ మ్యాచ్ క్రికెట్ మ్యాచ్. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఓపెనర్ సహీబ్‌జాదా ఫర్హాన్ తన 50 పరుగుల సందర్భంగా బ్యాట్‌ను తుపాకీలా పట్టుకుని కాల్చినట్లు అభినయించడం, హారిస్ రౌఫ్ 'రాఫెల్' విమానం కూల్చినట్లు చేతులతో సూచించడం వంటి సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయ్యాయి. ఈ చర్యలు 'జెంటిల్‌మెన్స్ గేమ్' నుంచి యుద్ధ వాతావరణంగా మార్చాయి. మ్యాచ్ తర్వాత భారత్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పాకిస్తాన్ కెప్టెన్‌తో షేక్ హ్యాండ్‌లు చేయకపోవడం, సిరీస్ గెలిస్తే పాకిస్తాన్ వ్యక్తి చేత అవార్డు స్వీకరించకపోవాలని నిర్ణయం తీసుకోవడం ఈ విద్వేషాన్ని మరింత ఊపందుకునేలా చేసింది. పాకిస్తాన్ క్రికెటర్లు మ్యాచ్‌లో చూపిన అభినయాలు క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తూ, దేశంలోని ఉగ్రవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఫర్హాన్ తన బ్యాట్‌ను ఏకే?47 తుపాకీలా పట్టుకుని భారత జట్టు దిగ్బంధనం వైపు 'కాల్చినట్లు' చేయడం, రౌఫ్ 'రాఫెల్' విమానం కూల్చినట్లు చేతులతో సూచించి '6?0' అని చూపించడం (ఆపరేషన్ సిందూర్‌లో పాక్ 6 భారత విమానాలను కిందపడేశామనే తప్పుడు ప్రచారానికి సూచన) వంటివి సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఈ చర్యలు పాకిస్తాన్ సమాజంలోని 'ముజాహిద్ మెంటాలిటీ'ని మైదానంలోకి తీసుకువచ్చినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇది క్రికెట్‌ను రాజకీయ ఆయుధంగా మార్చి, భారత్‌పై విద్వేషాన్ని ప్రదర్శించడానికి ఉదాహరణగా మారింది. ఫలితంగా, భారత జట్టు పాక్ ఆటగాళ్లతో దూరం పాటించడం మొదలుపెట్టింది, ఇది క్రీడా భావనలకు విరుద్ధమని అంతర్జాతీయ క్రికెట్ సంఘాలు చర్చిస్తున్నాయి. మే 7 భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే) మరియు పాకిస్తాన్‌లోని 9 ఉగ్రస్థావరాలపై దాడి చేసి, 100 మంది ఉగ్రవాదులను చంపింది. ఈ దాడుల్లో జైష్?ఏ?మహ్మద్ (జెఎమ్) ప్రధాన కార్యాలయం బహావల్‌పూర్‌లోని మర్కజ్ సుభానల్లా, లష్కర్?ఏ?తొయిబా (ఎల్‌ఎటి) మురీద్కేలోని మర్కజ్ తైబా వంటి కీలక స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడుల్లో జెఎమ్ ప్రధాని మసూద్ అజర్ కుటుంబ సభ్యులు 10 మంది మరణించారు, అతని సోదరుడు యూసుఫ్ అజర్ (1999 కాందహార్ విమాన హైజాక్ చేసినవాడు) సహా. మసూద్ అజర్ 1999లో భారత విమానాన్ని హైజాక్ చేసి విడుదలైన ముగ్గురు ఉగ్రవాదుల్లో ఒకడు, జెఎమ్‌ను స్థాపించి పార్లమెంట్, పుల్వామా దాడులకు కారణమయ్యాడు. ఈ దాడులు పాహల్గామ్ టెర్రర్ అటాక్ (ఏప్రిల్ 22, 2025లో 26 మంది మరణాలు)కు ప్రతీకారంగా జరిగాయి. ఈ సంఘటనలు పాక్ ఉగ్రవాద యంత్రాంగానికి తీవ్ర దెబ్బ తీసుకొచ్చాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్తాన్?ప్రాయోజిత ఉగ్రవాద సంస్థలు పీవోకే, పంజాబ్ నుంచి కైబర్ పక్తూంఖ్వా (కేపీకే)కు తమ స్థావరాలను తరలిస్తున్నాయి. జెఎమ్, ఎల్‌ఎటి, హిజ్బుల్ ముజాహిదీన్ (ఎచ్‌ఎమ్) వంటి సంస్థలు కేపీకేలోని మాన్సెహ్రా, గర్హీ హబీబుల్లా వంటి ప్రాంతాల్లో కొత్త శిబిరాలు నిర్మిస్తున్నాయి. ఈ తరలింపు భారత దాడుల నుంచి రక్షణ కోసం, అఫ్ఘనిస్తాన్ సరిహద్దు సమీపంలోని కఠిన భూభాగాన్ని ఉపయోగించడానికి జరుగుతోంది. సెప్టెంబర్ 14న మాన్సెహ్రాలో జెఎమ్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరగడం ఈ మార్పును స్పష్టం చేసింది. పాక్ ప్రభుత్వం ఈ చర్యలకు మద్దతు ఇస్తూ, ఉగ్రవాదులకు సురక్షిత ప్రదేశాలు అందిస్తోంది. ఇది భారత్‌పై తదుపరి దాడులకు తయారి చేస్తున్నట్లు తెలుస్తోంది. ధ్వంసమైన ఉగ్రస్థావరాల పునర్నిర్మాణంపై పాకిస్తాన్ ఉగ్రవాద యంత్రాంగం పట్టుదలను చూపిస్తోంది. బహావల్‌పూర్‌లోని సుభానల్లా కాంప్ కాంప్లెక్స్ (సరిహద్దు నుంచి 200 కి.మీ. దూరం), మురీద్కేలోని ఎల్‌ఎటి కేంద్ర కార్యాలయాలు పాక్ ప్రభుత్వ సహాయంతో పునర్నిర్మిస్తున్నాయి. మురీద్కేలో ఆగస్టు 18 నుంచి డిమాలిషన్ పూర్తి చేసి, సెప్టెంబర్ 7 నాటికి పునర్నిర్మాణం ప్రారంభమైంది, 2026 ఫిబ్రవరి నాటికి పూర్తి స్థాయికి చేర్చాలని లక్ష్యం. పాక్ ప్రభుత్వం 4 కోట్లు మద్దతు ఇచ్చింది, 'ఫ్లడ్ రిలీఫ్' పేరిట డబ్బులు సేకరిస్తూ ఈ పనులకు ఉపయోగిస్తున్నారు. ఈ చర్యలు ఉగ్రవాదాన్ని పునరుజ్జీవనం చేస్తూ, భారత్‌పై కొత్త ముప్పును సృష్టిస్తున్నాయి. ఆసియా కప్ మ్యాచ్‌లో పాక్ క్రికెటర్ల ప్రవర్తన, ఉగ్రస్థావరాల తరలింపు, పునర్నిర్మాణం భారత్?పాకిస్తాన్ మధ్య విద్వేషం ద్వంద్వాన్ని స్పష్టం చేస్తున్నాయి. క్రికెట్ మైదానంలో 'తుపాకీ, విమాన ధ్వంసం' అభినయాలు ఉగ్రవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుంటే, ఆపరేషన్ సిందూర్ తర్వాత కేపీకేలో కొత్త శిబిరాలు భవిష్యత్ దాడులకు సిద్ధం కావడాన్ని సూచిస్తున్నాయి. భారత్ ఈ ముప్పును ఎదుర్కోవడానికి డిప్లొమసీ, సైనిక చర్యలు మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

## డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ కు

# మహిళా కాంగ్రెస్ అభినందనలు







**బోడుప్పల్, నవంబర్ 24, (తెలంగాణ దిశ):** కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్‌ను సోమవారం మహిళా కాంగ్రెస్ నేతలు ఘనంగా సన్మానించారు. బోడుప్పల్ లోని ఆయన నివాసంలో మహిళా కాంగ్రెస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున హాజరై ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా రాజనోళ్ల లక్ష్మి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష పదవిని బిసి బిడ్డ తోటకూర వజ్రేష్ యాదవ్ కు ఇవ్వడం పట్ల ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దశలవారీగా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా మహిళలకు ఇందిరమ్మ చీరలు ఇవ్వడం అభినందనీయమన్నారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు మెరుగు సునీత, రాంపల్లి అరుంధతి, మేడ్చల్ జిల్లా కార్యదర్శి జి. శోభారాణి, మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి, మేడ్చల్ బి బ్లాక్ అధ్యక్షురాలు ఈగ శ్వేత, బోడుప్పల్ అధ్యక్షురాలు సమతా యాదవ్, కీసర మండల అధ్యక్షురాలు సుమతి, నాగారం అధ్యక్షురాలు స్వప్న గౌడ్, దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షురాలు జూపల్లి శోభారాణి, పిర్జాదిగూడ ఇంచార్జీ కూరపాటి అరుణ, పీర్జాదిగూడ ఉపాధ్యక్షురాలు తలసాని అంజమ్మ, 125 డివిజన్ ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ, ఘట్కేసర్ మున్సిపల్ అధ్యక్షురాలు పైళ్ల లత, మేడ్చల్ బ్లాక్ కార్యదర్శి ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తాం..!

మారిన ప్రపంచ, దేశ పరిస్థితుల దృష్ట్యా.. ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని ప్రధాని, కేంద్ర హెూం శాఖ మంత్రి, సీనియర్ పోలీస్ అధికారులు నిరం తరం చేసిన అభ్యర్థనల దృష్ట్యా తమ పార్టీ ఆయుధాలను వదులు కోవాలని నిర్ణయించుకుంటున్నదని ఆ పార్టీ నేత అభయ్ పేరుతో ఈ నెల 16న ఒక లేఖ విడుదలైన విషయం తెలిసిందే. సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని తమ పార్టీ నిర్ణయించుకుంటున్నదని అందులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు, పోరాడుతున్న సంస్థలతో వీలైనంత వరకు కలిసి పోరాడుతామని వివరించారు. ఈ అంశంపై కేంద్ర హెూం శాఖ మంత్రితో లేదా ఆయన నియమించిన వ్యక్తులతో లేదా ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. మారిన తమ పార్టీ అభిప్రాయం గురించి పార్టీకి తెలియజేయడం తమ బాధ్యత అని, పార్టీలో ఈ అంశాన్ని అంగీకరించేవారు లేదా వ్యతిరేకించేవారు చర్చల్లో అంగీకరించి పాల్గొనే సహచరుల నుంచి ఒక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ప్రస్తుతం తమతో అందుబాటులో ఉన్న పరిమిత క్యాడర్, కొంతమంది నాయకత్వ సహచరులు ఈ కొత్త విధానాన్ని పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న సహచరులతో, జైల్లో ఉన్న సభ్యులతో సంప్రదించేందుకు నెలరోజుల గడువు ఇస్తూ 'సీజ్ ఫైర్' చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారా తమ అభిప్రాయాలను పంచుకునేందుకు కూడా తమ పార్టీ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అయితే, మావోయిస్టు పార్టీలో మారిన ఈ విధానం సంచలం సృష్టిస్తున్నది. మావోయిస్టు పార్టీ సుప్రీం లీడర్ బసవరాజు మృతి తరువాత ఇటీవల కొత్త నాయకత్వంలో భాగంగా ఆయన స్థానంలో తిప్పిరి తిరుపతిని ప్రధాన కార్యదర్శిగా ఎంచుకున్న నేపథ్యంలో ఈ లేఖ విడుదల అవ్వడం మరింత సంచలనం కలిగిస్తున్నది. అంతేకాకుండా, ఎన్నడూ లేని విధంగా మావోయిస్టు నేత (అజ్ఞాత నేత) ఫొటోతో ఆ పార్టీ లేఖను విడుదల చేయడం దేశంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో చర్చానీయాంశంగా మారింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో వచ్చిన ఈ లేఖ మంగళవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ప్రధాని, కేంద్ర హెూంశాఖ మంత్రి, మావోయిస్టు ఉద్యమ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హెూంశాఖ మంత్రులు శాంతిచర్చల పట్ల అనుకూలమైన వైఖరిని అవలంబించిన పాలక, అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులు, శాంతి కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, ప్రజల ముందు మావోయిస్టు పార్టీ తన మారిన వైఖరిని స్పష్టంచేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతిచర్చలకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని ఈ ఏడాది మార్చి చివరి వారం నుంచి విజ్ఞప్తి చేస్తున్నట్టు మావోయిస్టు పార్టీ తెలిపింది. పత్రికా ప్రకటన విడుదల చేసినట్టు తాజా లేఖలోనూ మావోయిస్టులు తెలిపారు. అందులో తమ పార్టీ ఆయుధాలను వదులుకుంటున్నట్టు ప్రస్తావించారని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వానికి కాల్పుల విరమణ సైతం ప్రతిపాదించినట్టు వివరించారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకపోగా.. గత ఏడాది జనవరి నుంచి వేలాది సంఖ్యలో జరుపుతున్న సైనిక దాడిని తీవ్రతరం చేసింది. వేలాదిమంది సాయుధ పోలీస్ బలగాలను మోహరించి చుట్టుముట్టి నిర్మూలన దాడి జరిపింది.

## ఘనంగా వైష్ణవి ఎన్ క్లేవ్ అధ్యక్షులు గంప కృష్ణ గుప్తా దంపతుల వార్షికోత్సవ వేడుకలు



వైష్ణవి ఎన్ క్లేవ్ అధ్యక్షులు గంప కృష్ణ గుప్తా దంపతుల వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు ఆయనకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆయనకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా కృష్ణా గుప్తా నివాసంలో పలువురు దంపతులను శాలువాతో సన్మానించి కేక్ కట్ చేపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెబెల్లి శ్రీనివాస్ గుప్త,వేమిశెట్టి విక్రమ్ గుప్త, బిలిదే భగవాన్ గుప్త, కండె శివ గుప్త, అనుముల నర్సింగ్ రావు గుప్త పాల్గొన్నారు.

(కుషాయిగూడ, తెలంగాణ దిశ)

## విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడమే

# ఎన్ఎస్ఎస్ లక్ష్యం

విద్యార్థి దశ నుంచే సేవా భావం, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించేందుకు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ కళాశాలలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్యపర్చడంలోను ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కృషి వెల కట్టలేనిది. సమాజంలో ఉన్నవారిని చైతన్యపర్చడంతో పాటు, సమాజ సేవను తమ సేవగా భావించే భావజాలం విద్యార్థి దశ నుంచే అలవాటు చేయడం ద్వారా దేశ భవిష్యత్తుకు పునాదులు వేసినట్లవుతుంది. ప్రతిఫలం ఆశించకుండా సేవా మార్గం పట్టేవారే ఎన్ఎస్ఎస్‌లో వలంటీర్లుగా చేరతారు.

జాతీయ సేవా పథకం (నేషనల్ సర్వీస్ స్కీమ్ ) భారత ప్రభుత్వం చేత 1969 సంవత్సరం ప్రారంభించబడిన యువజన కార్యక్రమం. ఈ పథకాన్ని ప్రారంభించి నేటికీ 57 సంవత్సరాలు. ఇక దీని చరిత్రలోకి పోతే డా. డి.ఎస్. కొఠారి (1964–66) నేతృత్వంలోని విద్యా కమీషన్, విద్య అన్ని దశలలో ఉన్న విద్యార్థులను ఏదో ఒక విధమైన సామాజిక సేవతో ముడిపెట్టాలని సిఫారసు చేసింది. ఏప్రిల్ 1967 సంవత్సరంలో రాష్ట్రాల విద్యాశాఖ మంత్రి వారి సమావేశంలో దీనిని పరిగణనలోకి తీసుకున్నారు. అయితే అప్పటికే విశ్వవిద్యాలయ దశలో, స్వచ్ఛంద ప్రాతిపదికన ఉనికిలో ఉన్న నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్ సి సి) లో చేరడానికి విద్యార్థులను అనుమతించాలని, దీనికి ప్రత్యామ్నాయాన్ని నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) అని పిలువబడే కొత్త కార్యక్రమం రూపంలో వారికి అందించవచ్చని వారు సిఫార్సు చేశారు. 1969 సంవత్సరంలో సెప్టెంబరులో జరిగిన వైస్ చాన్సలర్స్ కాన్ఫరెన్స్ ఈ సిఫారసు ప్రకారంగా,సమస్యను వివరంగా పరిశీలించడానికి వైస్ చాన్సలర్లతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయవచ్చని సూచించారు. భారత ప్రభుత్వ విద్యపై జాతీయ విధానం ప్రకటనలో, పని అనుభవం, జాతీయ సేవ విద్యలో అంతర్భాగంగా ఉండాలని నిర్దేశించబడింది. మే, 1969 సంవత్సరంలో, విద్యా మంత్రిత్వ శాఖ, విశ్వవిద్యాలయ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థల విద్యార్థుల ప్రతినిధుల సమావేశం కూడా ఏకగ్రీవంగా 'జాతీయ సేవ జాతీయ సమైక్యతకు శక్తివంతమైన సాధనం కాగలదని ప్రకటించింది. పట్టణ విద్యార్థులను గ్రామీణ జీవితానికి పరిచయం చేయడానికి, తద్వారా దేశ పురోభివృద్ధికి, అభ్యున్నతికి విద్యార్థి సమాజం చేస్తున్న కృషికి చిహ్నంగా ఉంటుందని జాతీయ సేవా పథకం తీసుకరావడం జరిగింది. 1969 సెప్టెంబరు 24న అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వి.కె.ఆర్.వి.రావు 37 విశ్వవిద్యాలయాలలో జాతీయ సేవా పథకం (ఎన్.ఎస్.ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించి, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఈ పథకం అమలుకు సహాయం,సహకారాన్ని అడిగిగారు. విద్యార్థుల ప్రప్రథమ కర్తవ్యం విద్యాభ్యాసం. కానీ భావి భారతాన్ని నిర్ణయించవలసినది యువకులే. ప్రతి దేశ పురోభివృద్ధిలోనూ, ఉద్యమాలలోనూ విద్యార్థులు పాలుపంచుకుంటారు. ఒక్కొక్కసారి ఆవేశం ఎక్కువ కావచ్చు కానీ కల్లాకపటం తెలియని నిర్మల మనస్కులు వీరు. వీరు కూడా సంఘజీవులే, సంఘంలో భాగస్వాములే, కాబట్టి సంఘసేవ (సోషల్ సర్వీస్) వాళ్ళకి బాధ్యత ఉంది. విద్యాభ్యాసానికి ఆటంకాలు లేకుండా సంఘసేవ చేసే అవకాశాలున్నాయి. ఒక మనిషి మరొక మనిషికి సహకరించడం మానవతా లక్షణం. అదేవిధంగా మనం పదిమందిలో ఉన్నప్పుడు మనవల్ల ఆ పదిమందికీ ప్రయోజనం వుండాలి– లేదా మనవల్ల మరొకరికి మేలు కలగాలి. ఆ విధంగా పరస్పర సహకారంగా, పరోపకారంగా, మంచిగా మెలగటమే సంఘసేవ. విద్యార్థుల్లో సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించడంతోపాటు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే అవకాశాన్ని కల్పించడం ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల్లో స్వచ్ఛంద సేవను ప్రోత్సహించేందుకు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఎన్ఎస్ఎస్ కార్యక్రమం రెండు భాగాలుగా విభజించబడింది:

సాధారణ కార్యకలాపాలు మరియు ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు.

సాధారణ కార్యకలాపాలలో వారంవారీ సమావేశాలు, సమాజ సేవ, సామాజిక సేవా ప్రాజెక్ట్‌లు ఉంటాయి. ప్రత్యేక క్యాంపింగ్ కార్యక్రమాలు సాధారణంగా 7 రోజుల పాటు నిర్వహించబడతాయి, ఈ సమయంలో విద్యార్థులు శుభ్రపరచడం, మొక్కల పెంపకం మరియు ఆరోగ్యం, పారిశుద్ధ్య కార్యక్రమాల వంటి సమాజ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. కళాశాలను పరిశుభ్రంగా వుంచటం– తోటలు పెంచటం– రోడ్లు వెయ్యటం.

పరిసర గ్రామాలను దత్తత తీసుకొని ఆ గ్రామంలో రోడ్లు వేయటం, మురికి వాడలను శుభ్రపరచడం, నిరక్షరాస్యులకి విద్య బోధించడం. ఆరోగ్య సూత్రాలను, వయోజన విద్య ఆవశ్యకతను, జనాభా సమస్య నివారణను ప్రజలకు తెలియజేయడం. వరదలు వచ్చినప్పుడు, అగ్ని ప్రమదాలలోనూ సహాయం చేయడం. ధనవంతుల నుండి విరాళాలు సేకరించి బీదవారికి, అనాథలకు సహాయపడటం. పొదుపు ఆవశ్యకతను, అంటు వ్యాధుల వల్ల వచ్చే అరిష్టాలను అరికట్టే విధానాలను ప్రచారం చేయడం దీని ముఖ్య లక్షణం.

# స్పీడ్ పోస్టు సర్వీస్‌లో పెను మార్పులు

పోస్టాఫీసు స్పీడ్ పోస్టు సర్వీస్ లో పెను మార్పులు తీసుకొచ్చింది. సర్వీస్ ఛార్జీలను పెంచింది. డెలివరీ విధానంలో కూడా మార్పులు చేసింది. ఓటీపీ, ఎస్ఎంఎస్ ద్వారా డెలివరీ చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోనుంది. ఈ మార్పులు అక్టోబర్ 1నుంచి అమలులోకి రానున్నాయి. పోస్టల్ డిపార్ట్ మెంట్ 1986లో స్పీడ్ పోస్ట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. స్పీడ్ పోస్టు ద్వారా అందించే లెటర్లు, ఇతర సమాచారం పత్రాలును అందించడంలో కొత్త ఫీచర్లను ప్రవేశపెట్టినట్లు పోస్టల శాఖ ప్రకటించింది. ప్రైవేట్ కొరియర్ కంపెనీలకు ధీటుగా పోస్టల్ డిపార్ట్ మెంట్ తన సేవలను అందిస్తోంది.అందులో భాగంగా స్పీడ్ పోస్ట్ టారిఫ్‌లను చివరిసారిగా 2012 లో సవరించారు. తాజాగా పెరుగుతున్న ఖర్చులు, నిర్వహన భారం నుంచి వెసులుబాటు పొందేందుకు కొత్తగా సర్వీస్ ఛార్జీలను సవరించింది. స్పీడ్ పోస్ట్ (పత్రాలు/పార్శిల్‌లు)
కోసం రిజిస్ట్రేషన్ అందుబాటులోకి తెచ్చారు. చిరునామాదారునికి లేదా వారి అధీకృత ప్రతినిధికి మాత్రమే డెలివరీ చేయనున్నారు. చిరునామాదారులు ఓటీపీని ధృవీకరించిన తర్వాత మాత్రమే స్పీడ్ పోస్టును డెలివరీ చేస్తారు. విద్యార్థులకు టారిఫ్‌పై10శాతం మినహాయింపు ఇవ్వనున్నారు. ఎస్ఎంఎస్ ద్వారా వినియోగదారులు డెలివరీ సంబంధిత సమాచారాన్ని చేరవేయనున్నారు. వినియోగదారులకు ఆన్‌లైన్ బుకింగ్ సౌకర్యం కూడా అందించనున్నారు. రియల్ టైమ్ డెలివరీ అప్‌డేట్‌ను కూడా తెలుసుకోవచ్చు.

**కొత్త టారిఫ్ రేట్లు.. :**పోస్టల్ శాఖ స్పీడ్ పోస్ట్ ఛార్జీలను సవరించింది.




1-50 గ్రాముల వరకు ఉన్న వస్తువులకు లోకల్ అయితే రూ.19, 2వేల కిలోమీటర్ల వరకు రూ.47 చొప్పునా వసూలు చేస్తారు. 51-250 గ్రాముల బరువున్న వస్తువులకు లోకల్ అయితే రూ.24. 200 కిలోమీటర్లకు వరకు రూ.59. 201-500 కిలోమీటర్ల వరకు రూ. 63. అలాగే 501-1000 కిలోమీటర్ల వరకు రూ.68. 1001-2 వేల కిలోమీటర్ల దూరం ఉంటే రూ.72 చొప్పునా చెల్లించాలి. 2వేల కిలోమీటర్ల పైన దూరం ఉంటే రూ.77 చొప్పునా చెల్లించాలి. 251-500 గ్రాముల వరకు బరువున్న వస్తువులకు స్థానిక(లోకల్)కు రూ.28. అలాగే 200 కిలోమీటర్ల వరకు రూ.70. 201- 500 కిలోమీటర్ల వరకు రూ.75. 501- 1000 కిలోమీటర్ల వరకు రూ.82 చొప్పునా వసూలు చేస్తారు. అలాగే రూ.1001- 2 వేల కిలోమీటర్ల దూరాలకు రూ. 86. 2వేల కిలోమీరట్ల కంటే ఎక్కువ దూరం ఉంటే రూ.93 చొప్పున ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా జీఎస్టీ వసూలు చేయనున్నారు.

# బ్రహ్మోస్ కంటే భీకరంరణ ‘ధ్వని’



రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధిస్తున్న భారత్.. అధునాతన క్షిపణి వ్యవస్థలు, ఫైటర్ జెట్లు, డ్రోన్ల ప్రాజెక్టులపై దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలో హైపర్‌సోనిక్ క్షిపణి ప్రయోగాలను ముమ్మరం చేస్తోంది. ఇందులో భాగంగా హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికల్ ‘ధ్వని’ పరీక్షలను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని డీఆర్‌డీఓ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌లో దడ పుట్టించిన బ్రహ్మోస్ కంటే ఈ క్షిపణులు భీకరంగా పనిచేస్తాయని అంచనా.అత్యంత వేగంగా ప్రయాణిస్తూ సుదూర లక్ష్యాలను నిమిషాల్లో ఛేదించగల సామర్థ్యం హెచ్‌జీవీల సొంతం. శబ్ద వేగానికి ఐదారు రెట్ల కంటే అధిక వేగంతో ఈ క్షిపణులు ప్రయాణించగలవు. డీఆర్‌డీఓ సిద్ధం చేస్తోన్న హెచ్‌జీవీ సుమారు గంటకు 7వేలకుపైగా కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.
1500 నుంచి 2వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదని అంచనా. వేగంతో పాటు దిశను మార్చుకునే సామర్థ్యం ఉండడంతో శత్రుదేశాల గగనతల రక్షణ వ్యవస్థలకు స్పందించే సమయం కూడా ఇవ్వదని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. హైపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణులకు భిన్నంగా ఈ నూతన గ్లైడ్ వెహికల్ ఉంటుంది. రాకెట్ సాయంతో అత్యంత ఎత్తుకు వెళ్లి.. అక్కడ నుంచి విడిపోయి హైపర్‌సోనిక్ వేగంతో లక్ష్యంవైపు దూసుకెళ్తుంది. శత్రువుల గగనతల నిరోధక వ్యవస్థలకు చిక్కకుండా లక్ష్యాలను ఛేదించే సామర్థ్యమున్న ఈ హెచ్‌జీవీ పరీక్షలను డీఆర్‌డీఓ ముమ్మరం చేసింది. ఇప్పటికే ఎయిర్‌ఫ్రేమ్ ఏరోడైనమిక్స్, థర్మల్ మేనేజిమెంట్, స్క్రామ్‌జెట్ ఇంజిన్ పనితీరు, గైడెన్స్ వ్యవస్థకు సంబంధించి క్షేత్రస్థాయి, వైమానిక పరీక్షలు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి ‘ధ్వని’ పూర్తి స్థాయి పరీక్షలు జరిపేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# సమస్యల పరిష్కారంలో రైతు కమిషన్ క్రియాశీలక పాత్ర

రాష్ట్ర రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడంలో రైతు కమిషన్ విజయవంతం అయింది. రైతును రాజు చేయాలనే సంకల్పంతో నిత్యం రైతన్నలతో సమావేశాలు నిర్వహిస్తూ రేవంత్ సర్కార్ కు నివేదికలు ఇస్తుంది. ఈ పరంపరలో సాగునీటి సంఘాల ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషిస్తున్నది. రాష్ట్రంలో చాలా చెరువులు, కుంటలు రియల్ ఎస్టేట్ మాఫియా చేతుల్లో కబ్జాకు గురవుతున్నాయి. కొందరు అక్రమార్కులు వెంచర్లు వేసి అడ్డగోలుగా అమ్ముకుంటున్నారు. చెరువుల పరిరక్షణ బాధ్యతను గత ప్రభుత్వం సక్రమంగా చేపట్టలేదనే అపవాదు ఉన్నది. పైగా చెరువులను అభివృద్ధి చేయకపోవడంతో భూగర్భజలాలూ దెబ్బతిన్నాయి. దీంతో గ్రామాల్లో ఉన్న చెరువుల రక్షణ, భూగర్భజలాలను కాపాడేందుకు నీటి సంఘాలు అవసరమని రైతు కమిషన్ సర్కారు దృష్టికి తీసుకెళ్లింది. త్వరలో సాగునీటి సంఘాలను రాష్ట్ర ప్రభుత్వం నియమించనుంది. సంబంధిత ప్రక్రియపై కసరత్తు జరుగుతున్నది.

**గతంలో క్రియాశీలక పాత్ర**

సాగునీటి నిర్వహణలో ఈ సంఘాల గతంలో ఎంతో క్రియాశీలక పాత్ర పోషించాయి. అందరికీ సమానంగా నీరు అందేలా చూడటం, నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా నీటి వృథాను తగ్గించడం, కాల్వల శుభ్రంగా ఉంచడం, వాటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించడం, నీటి నాణ్యతను కాపాడడానికి చర్యలు తీసుకోవడం, నీటి వినియోగంలో రైతుల మధ్య సహకారాన్ని పెంపొందించడం సాగునీటి సంఘాల ప్రధాన విధులుగా ఉండేవి. గతంలో సాగునీటి సంఘాలు ఘనమైన పాత్ర పోషించాయి. వాటికి పూర్వ వైభవం తీసుకు రావాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి నివేదించింది.

**రైతులకు దన్నుగా కమిషన్..**

ములుగు జిల్లాలో గిరిజన రైతులకు జరిగిన అన్యాయంపై కంపెనీల ప్రతినిధులు, మధ్యదళారులతో చర్చలు జరిపి సీడ్ కంపెనీల నుంచి రైతు కమిషన్ రూ.4 కోట్ల పరిహారం ఇప్పించింది. గద్వాలలో పత్తి, సూర్యాపేటలో వరి, ఖమ్మం జిల్లాలో మొక్కజొన్న విత్తనోత్పత్తి రైతులకు నష్టపరిహారం ఇప్పించింది. ఈ క్రమంలోనే రేవంత్?సర్కారు నకిలీ విత్తన తయారీదారుల భరతం పట్టేందుకు విత్తన చట్టం రూపకల్పన కు శ్రీకారం చుట్టింది. ఇతర రాష్ట్రాల్లోని చట్టాలను పరిశీలించడం తో పాటు రైతు సంఘాలు, రైతులతో సమావేశమై నివేదిక సిద్ధం చేసింది. ప్రభుత్వానికి రేపోమాపో ఆ నివేదిక ఇవ్వనుంది. అలాగే మనీ ల్యాండరింగ్ చట్టాన్ని తీసుకు వచ్చి రైతులకు అధిక వడ్డీ నుండి ఉపశమనం కలిగించాలని భావిస్తున్నది. వ్యవసాయ శాఖకు వెళ్లాల్సిన రైతులు కమిషన్?వెళ్లి తమ సమస్యలను వినవించుకుంటున్నారు. రోజుకు వందలాది మంది అన్నదాతలు



వస్తే ఓపికతో కమిషన్?సభ్యులు భవానీరెడ్డి, సునీల్, రాములు నాయక్, వెంకన్న యాదవ్, గంగాధర్, గోపాల్?రెడ్డి, ఏవీఎన్?రెడ్డి సమస్యలకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.

**ఆదర్శ రైతు వ్యవస్థ..**

పోడు పట్టాలు కలిగిన రైతులకు పంట రుణాలు ఇచ్చేలా రైతు కమిషన్ ప్రభుత్వానికి సూచనలు చేసింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతులకు పోడు పట్టాలు ఉన్నాయి.
కానీ వివిధ కారణాలతో గిరిజన రైతులు పంట రుణాలు పొందలేకపోతున్నారు. బ్యాంకర్లు సైతం లోన్లు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఈ విషయం కమిషన్ దృష్టికి రావడంతో ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ, బ్యాంకర్లు, ఫారెస్ట్ అధికారులు, గిరిజన రైతులతో సమావేశం నిర్వహించారు.
గిరిజన రైతులకు పోడు పట్టాలు ఉంటే తప్పనిసరిగా పంట రుణాలు ఇచ్చేలా చూడాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ విషయంలో చొరవ తీసుకొని పోడు పట్టాలు ఉన్న గిరిజన రైతులకు పంట రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టింది. దసరా తర్వాత ఈ ప్రక్రియ అమల్లోకి రానుంది. ఇక రాష్ట్రంలో ఆదర్శ రైతు వ్యవస్థను తిరిగి తీసుకురావాలని రైతు కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. దీంతో పాటు మరికొన్ని అంశాలపైనా ప్రభుత్వానికి సూచించింది. వాటిని పరిశీలించి ఆమోదించే పనిలో రేవంత్ సర్కార్ నిమగ్నమైంది. రైతు కమిషన్ ప్రతిపాదనలు అమలు జరిగితే రాష్ట్రంలో రైతన్నలకు మరింత మేలు జరగనుంది.



# మహిళలపై ఏఐ పంజా

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా మహిళా ఐటీ ఉద్యోగులపై ఏఐ పంజావిసురుతున్నది. కృత్రిమ మేధ ప్రభావంతో.. 28శాతం మహి ళా ఉద్యోగులు ఉపాధి కోల్పోయే అవకాశం కనిపిస్తున్నది. అదే పురుషుల్లో ఈ సంఖ్య.. 21శాతంగా ఉన్నది. ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక.. ‘జెండర్ స్నాప్‌షాట్-2025’ ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ క్రమంలో ఐటీ రంగంలో జెండర్ డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని సదరు నివేదిక పిలుపునిచ్చింది. అంతేకాకుండా.. డిజిటల్ రంగంలో లింగ అసమానతలను కూడా ఈ నివేదిక హైలైట్ చేస్తున్నది. ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం.. ప్రపంచ టెక్ వర్క్‌ఫోర్స్‌లో మహిళలు కేవలం 29శాతం మంది మాత్రమే ఉన్నారు. అదే నాయకత్వం స్థానాల్లో మహిళల వాటా 14శాతం మాత్రమే! ఈ క్రమంలో ఐటీ రంగంలో పురుషాధిక్యమే రాజ్యమేలుతున్నదనీ, ఈ అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఐటీ రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడం ద్వారా.. 34.5 కోట్ల మంది మహిళలు, బాలికలకు ప్రయోజనం చేకూరుతుందని చెబుతున్నారు. 3 కోట్ల మందిని తీవ్రమైన పేదరికం నుంచి బయట పడేసే అవకాశం ఉన్నదని పేర్కొంటున్నారు. మరో 4.2 కోట్ల మందికి ఆహార భద్రత దక్కుతుందని వెల్లడిస్తున్నారు. ఇందుకోసం మహిళలకు ఏఐపై శిక్షణ ఇప్పించడం, డిజిటల్ సాంకేతిక రంగాల్లో పెట్టుబడులు పెట్టడంతోపాటు మహిళలకు కార్మిక-సామాజిక రక్షణ విధానాలను అమలు చేయడం ముఖ్యమని చెబుతున్నారు.

# ఆధార్ అప్‌డేట్ చేసుకునే వాళ్లకు బ్యాడ్ న్యూస్.. పెరిగిన సర్వీస్ ఛార్జెస్

నేటి సమాజంలో ఆధార్ కార్డు వినియోగం ఎంత కీలకంగా మారిందో ప్రతి ఒక్కరికీ తెలుసు. సిమ్ కార్డు కొనుగోలు మొదలు బ్యాంకు ఖాతాలు తెరవడం, వాహనాలు, ఇండ్లు, భూముల క్రయ విక్రయాలు.. ప్రభుత్వ పథకాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్ వంటి వాటికి అధార్ తప్పనిసరి అయ్యింది. అయితే.. వయసు పెరుగుతున్న కొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం సర్వసాధారణం. దీంతోపాటు ఇంటి చిరునామాలు మారుతుండడంతో అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డుదారులు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మనం ఎప్పటికప్పుడు ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.ఆధార్‌లో మార్పులు, చేర్పులకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ ఎప్పటికప్పుడు అవకాశం కల్పిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆధార్ అప్ డేట్ సర్వీసు ఛార్జీలను ఉడాయ్ తాజాగా సవరించింది. పెరిగిన ఛార్జీలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇవి సెప్టెంబర్ 30, 2028 వరకు చెల్లుబాటు అవుతాయి. సర్వీసును బట్టి ఛార్జెస్‌లో మార్పులు ఉంటాయి. ఉడాయ్ సవరించిన ఆ సర్వీసు ఛార్జీలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.. డెమోగ్రాఫిక్ అప్‌డేట్స్.. పేరు, చిరునామా, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్ లేదా ఇమెయిల్ వివరాల అప్‌డేట్‌కు రూ. 75 ఖర్చువుతుంది. గతంలో ఇది రూ. 50గా ఉండేది. బయోమెట్రిక్ అప్‌డేట్.. ఫింగర్ ప్రింట్, ఐరిస్, ఫోటో వంటివి అప్ డేట్ చేసుకోవాలంటే ఇకపై రూ.125 చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఇది రూ.100గా ఉండేది. ఇది 2028 అక్టోబర్ 1 తర్వాత రూ.150కి పెరగనుంది. మై ఆధార్ పోర్టల్ ద్వారా డాక్యుమెంట్ అప్‌డేట్ జూన్ 14, 2026 వరకు ఉ



చితంగా చేసుకోవచ్చు. అదే నమోదు కేంద్రాల్లో అయితే రూ.75 ఖర్చువుతుంది. గతంలో ఇది రూ.50 గా ఉండేది. అలాగే ఆధార్ ప్రింటవుట్ పొందడానికి రూ. 40 ఖర్చువుతుంది. 5 నుంచి 7 ఏళ్ల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డే ట్‌ను ఉచితంగా చేసుకోవచ్చు. ఆ పైన 15 నుంచి 17 ఏళ్ల పిల్లలకు ఒకసారి ఫ్రీ. 7 నుంచి15 సంవత్సరాల వయస్సు పిల్లలకు సాధారణంగా రూ. 125 వసూలు చేస్తారు. కానీ, ఈ ఛార్జీని సెప్టెంబర్ 30, 2026 వరకు మాఫీ చేశారు. హెూమ్ సర్వీస్.. ఆధార్ సెంటర్లకు వెళ్లలేని వారు ఇంటి వద్దే ఆ సేవలు పొందొచ్చు. అయితే, హెూమ్ సర్వీస్‌కు రూ. 700 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఛార్జీ కేవలం ఇంటికొచ్చి సర్వీస్ అందిస్తున్నందుకు మాత్రమే. డెమోగ్రాఫిక్, బయోమెట్రిక్ అప్‌డేట్స్‌కు సెపరేట్‌గా ఛార్జెస్ ఉంటాయి.

# చరిత్ర సృష్టించిన ఎలాన్ మస్క్.. 500 బిలియన్ డాలర్ల సంపద కలిగిన తొలి వ్యక్తిగా ఘనత..!

టెస్లా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (%జజుూ%) ఎలాన్ మస్క్ చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో 500 బిలియన్ డాలర్ల నికర విలువ కలిగిన మొదటి వ్యక్తిగా నిలిచారు. కానీ, ప్రస్తుతం పుంజుకుంటున్నాయి. మస్క్ వ్యాపారంపై మళ్లీ దృష్టి పెట్టడం ప్రారంభించడంతో పెట్టుబడిదారుల విశ్వాసం మరింత పెరిగింది. టెస్లా డైరెక్టర్ల బోర్డు చైర్మన్ రాబిన్ డెన్‌హెూమ్ గత నెలలో మస్క్ ఇప్పుడు కంపెనీ వ్యవహారాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలిపారు. కొన్ని నెలలు వైట్ హౌస్ సంబంధిత పనుల్లో బిజీగా గడిపిన విషయం తెలిసిందే.టెస్లా షేర్లలో పెరుగుదల,ఇతర టెక్ కంపెనీల విలువల పెరుగుతున్న వేగంగా కారణంగా ఆయన ఈ ఘనతను సాధించాడు. ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితా ప్రకారం.. బుధవారం సాయంత్రం 4.15 నాటికి మస్క్ సంపద 500.1 బిలియన్లకు చేరింది. మస్క్ సంపదలో ఎక్కువభాగం టెస్లాదే. టెస్లా షేర్లలో 12.4 శాతానికి పైగా వాటా మస్క్‌కి ఉన్నది. ఈ సంవత్సరం ఇప్పటివరకు టెస్లా షేర్లు 14 శాతానికిపైగా పెరిగాయి. బుధవారం మరో 3.3 శాతం పెరగడంతో ఒకేరోజు మస్క్ సంపదకు 6 బిలియన్లకుపైగా వృద్ధి చెందింది.వాస్తవానికి ఈ ఏడాది ప్రారంభంలో టెస్లా షేర్లు దారుణంగా పడిపోయాయి. కానీ, ప్రస్తుతం పుంజుకుంటున్నాయి. మస్క్ వ్యాపారంపై మళ్లీ దృష్టి పెట్టడం ప్రారంభించడంతో పెట్టుబడిదారుల విశ్వాసం మరింత పెరిగింది. టెస్లా డైరెక్టర్ల బోర్డు చైర్మన్ రాబిన్ డెన్‌హెూమ్ గత నెలలో మస్క్ ఇప్పుడు కంపెనీ వ్యవహారాల్లో చురుగ్గా ఉన్నట్లు తెలిపారు. కొన్ని నెలలు వైట్ హౌస్ సంబంధిత పనుల్లో బిజీగా గడిపిన విషయం తెలిసిందే. మస్క్ దాదాపు బిలియన్ డాలర్ల విలువైన టెస్లా షేర్లను కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించాడు. ఇది టెస్లా భవిష్యత్తుపై బలమైన విశ్వాసాన్ని చూపించింది. కంపెనీ సాంప్రదాయ



కార్ల తయారీదారుని దాటి ముందుకు సాగడానికి ఏఐ, రోబోటిక్స్ ప్రపంచంలో ప్రధాన శక్తిగా మారడానికి కృషి చేస్తోంది. ఫోర్బ్స్ లెక్కల ప్రకారం రెండో బిలియనీర్‌గా ఒరాకిల్ కోఫౌండర్ లార్రీ ఎలిసన్ నిలిచారు. ఆయన నికర విలువ 351.5 బిలియన్ డాలర్లు.

# సిట్రోయెన్ కొత్త కారు ధర ఎంతంటే...?



సిట్రోయెన్ ఇండియా.. దేశీయ మార్కెట్లో ‘ఎయిర్‌క్రాస్ ఎక్స్’ లాంచ్ చేసింది. ఈ కారు ధరలు రూ. 8.29 లక్షల నుంచి ప్రారంభమై రూ. 13.69 లక్షల (ఎక్స్-షోరూమ్) వరకు ఉన్నాయి. కంపెనీ ఈ లేటెస్ట్ మోడల్ కోసం బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. డెలివరీలు త్వరలోనే ప్రారంభమవుతాయి.కొత్త డీప్ ఫారెస్ట్ గ్రీన్ రంగులో కనిపించే ఈ కొత్త సిట్రోయెన్ ఎయిర్‌క్రాస్ ఎక్స్.. ఎంట్రీ %Ꮷ% పుష్ స్టార్ట్ బటన్, క్రూయిజ్ కంట్రోల్, స్పీడ్ లిమిటర్, ఆటో ఐఆర్వీఎం, ఎల్ఈడీ ప్రొజెక్టర్ ఫాగ్ లాంప్స్, వెంటిలేటెడ్ సీట్లు, 360-డిగ్రీ కెమెరా వంటి వాటితో పాటు 10.25 ఇంచెస్ ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, 7 ఇంచెస్ డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ కూడా పొందుతుంది.లేటెస్ట్ డిజైన్, ఫీచర్స్ కలిగిన ఈ ఫ్రెంచ్ బ్రాండ్ కారు.. సేఫ్టీలో 5 స్టార్ రేటింగ్ సాధించిందిఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ హెూల్డ్ అసిస్ట్, ఏబీఎస్ విత్ ఈబీడీ, రియర్ పార్కింగ్ సెన్సార్లు మొదలైన సేఫ్టీ ఫీచర్స్ ఈ కారులో ఉన్నాయి.ఇంజిన్ విషయానికి వస్తే.. కొత్త సిట్రోయెన్ ఎయిర్‌క్రాస్ ఎక్స్ 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ %Ꮷ% 1.2-లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్స్ ఉన్నాయి. మొదటి ఇంజిన్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఎంపికను మాత్రమే పొందుతుంది. రెండోది మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌ను పొందుతుంది.

# డ్రైవర్ అవసరం లేని ఆటో ధర ఎంతో తెలుసా?

ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ తయారీదారు ఒమేగా సీకి మొబిలిటీ .. భారతదేశంలో తన మొట్టమొదటి అటానమస్ ఎలక్ట్రిక్ ఆటో-రిక్షాను లాంచ్ చేసింది. కంపెనీ దీనికి ‘స్వయంగతి’ అని పేరు పెట్టింది. ఇది ప్యాసింజర్ వెర్షన్, కార్గో వెర్షన్ అనే రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. వీటి ధరలు వరుసగా రూ.4 లక్షలు, రూ. 4.15 లక్షలు (ఎక్స్ షోరూమ్).ఒమేగా సీకి మొబిలిటీ.. ఈ సరికొత్త అటానమస్ ఎలక్ట్రిక్ ఆటో-రిక్షా కోసం బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. డెలివరీలు వెంటనే ప్రారంభమవుతాయి. ఇది 10.3 కిలోవాట్ బ్యాటరీ ద్వారా 120 కిమీ రేంజ్ అందిస్తుంది. అయితే దీనికి కావలసిన ఛార్జింగ్ సదుపాయాల గురించి ఎలక్ట్రిక్ వాహన తయారీదారు ఇంకా ఎటువంటి సమాచారం అందించలేదు.స్వయంగతి ఒమేగా సీకి.. ఏఐ స్వయంప్రతిపత్తి వ్యవస్థను పొందుతుంది. ఈ సెటప్‌లో లి-డార్ టెక్నాలజీ, రిమోట్ సేఫ్టీ ఫీచర్స్ ఉన్నాయి. ఇవన్నీ డ్రైవర్ అవసరం లేకుండానే.. ప్రీ-మ్యాప్ చేసిన మార్గాలను నావిగేట్ చేయడానికి వీలు కల్పిస్తాయి. కంపెనీ ఈ ఆటో రిక్షాను ఇప్పటికే టెస్ట్ చేసింది. రెండో దశలో కూడా టెస్ట్ చేయనున్నట్లు సమాచారం.విమానాశ్రయాలు, టెక్ పార్కులు, గేటెడ్ కమ్యూనిటీలు, పారిశ్రామిక ప్రాంతాలు, స్మార్ట్ సిటీలలో ఈ ఎలక్ట్రిక్ రిక్షాలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

# డిగ్రీలో సగం..సీట్లు ఖాళీ..!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** స్పెషల్ స్పాట్ అడ్మిషన్లతో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. డిగ్రీలో ప్రవేశాలు ముగిసినా సీట్లు మాత్రం పూర్తిస్థాయిలో నిండలేదు. ఎన్నడూలేనంతగా ఈ సారి సీట్లు మిగిలిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, నాన్ దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) కాలేజీలు 967 ఉన్నాయి. వీటిలో4,38, 387 సీట్లు ఉంటే, ఇందులో స్పాట్ అడ్మిషన్లు మినహా 1,96,451 సీట్లు భర్తీ అయ్యా యి.ఇంకా 2,41,936 సీట్లు నిండలేదు. స్పా ట్ అడ్మిషన్లలో భర్తీ అయిన సీట్లు దాదా పు 5 వేల వరకు ఉంటాయి. అంటే ఇప్పటివరకు నిండిన మొత్తం సీట్లు 2,06,451 కాగా, ఇంకా మిగిలిన సీట్లు 2,31,936 ఉన్నాయి. ఇంత మొత్తంలో సీట్లు గతేడాది కూడా మిగల్లేదు. కానీ, సీట్ల పరంగా చూసుకుటే ఈ సారి అత్యధికంగా ఖాళీగా మిగలడం గమనార్హం. 2024-25 విద్యాసంవత్సరంలో మొత్తం 4,57,704 సీట్లకు 2.12 లక్షలు సీట్లు భర్తీకాగా, 2.45 లక్షల సీట్లు ఖాళీగా మిగిలాయి.టాప్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనే కాదు.. గురుకులాల్లోనూ ఈ సారి సీట్లు మిగిలాయి. తెలంగాణ సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీలు 79 ఉండగా, ఇందులో 23,614 సీట్లకు 11,257 సీట్లే భర్తీ అయ్యాయి. ఈ నెల 11 వరకు ఉన్న అధికారిక గణాంకాల ప్రకారం గురుకులాల్లో 12,357 సీట్లు మిగిలాయి. సోషల్ వె ల్ఫేర్ డిగ్రీ కాలేజీల్లో 8,080 సీట్లకు 2,897 సీట్లు మిగలగా, ట్రైబల్ వెల్ఫేర్‌లో 5,620 సీట్లలో ఇంకా 2,291 సీట్లు నిండలేదు.బీసీ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీల్లో 9,914 సీట్లకు 7,169 సీట్లు మిగిలాయి. ఇక దోస్త్ పరిధిలోలేని కాలేజీలు 58 ఉన్నాయి. వీటిలో 36,866 సీట్లకు 16,182 మాత్రమే నిండగా, 20,684 సీట్లు మిగిలాయి. ఇలా మొత్తంగా స్పాట్ అడ్మిషన్లలో సుమారు ఓ 5 వేల సీట్లు నిండాయనుకున్నా, మొత్తం 967 కాలేజీల్లో 4,38,387 సీట్లకు 2,06,451 సీట్లు నిండగా ఇంకా సీట్లు 2,31,936 భర్తీ కాలేదు.మొదటి నుంచీ డిగ్రీ కోర్సు ల్లో సీట్లు అత్యధికంగా మిగులుతున్నాయి. బీఎస్సీ, బీఏ, బీకామ్‌లలో ఒక్క బీకామ్ మినహాయిస్తే మిగతా కోర్సుల్లో విద్యార్థు లు చేరేందుకు ఇష్టపడటంలేదు. డిగ్రీ చేసినవారికి ఉపా ధి అవకాశాలు తక్కువగా ఉండ టం, ఇంటర్ తర్వాత ఇంజినీరింగ్, మెడిసిన్, ఇతరత్రా డిమాం డ్ ఉన్న కోర్సులవైపు విద్యార్థు లు మక్కువ చూపిస్తుండటం దీనికి ప్రధాన కారణం.ఈ క్రమంలోనే ఏటా డిగ్రీలో సీట్లు భారీగా మిగిలిపోతున్నాయి. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా డిగ్రీ సిలబస్‌ను ఎప్పటి కప్పుడు తెలంగాణ ఉన్నత విద్యామండలి మార్పులు చేర్పులు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయి లో సీట్లు నిండటంలేదు. ఇప్పటికే నాలుగైదు దఫాల్లో డిగ్రీ సీట్లు నింపినా రెండు లక్షల సీట్లే భర్తీ అయ్యాయి.

# పత్తి కొనుగోలుకు సీసీఐ యాప్!



**అదిలాబాద్,తెలంగాణ దిశ:**రైతులు పత్తి అమ్ముకోవాలంటే మధ్యవర్తుల దోపిడి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటివాటికి చెక్ పెట్టేందుకు సీసీఐ కొత్త యాప్ విధానం తీసుకొచ్చింది. 'కపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ సీజన్ రైతులు పంట అమ్ముకునేదుకు తమ వివరాలు, పంట సాగుకు సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసి స్లాట్ బుక్ చేయాలి.ఇలా చేయడం ద్వారా సెంటర్ల వద్ద రైతుల రద్దీని కంట్రోల్ చేయడమే కాకుండా.. అక్రమాలను అడ్డుకోవచ్చని సీసీఐ అనుకుంటోంది. కపాస్ కిసాన్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత రైతు పేరు, జండర్, డేట్ ఆఫ్ బర్త్, క్యాస్ట్, అడ్రస్, ఆధార్, మె?బైల్ నంబర్, అడ్రస్‌తో రిజిస్టర్ అవ్వాలి. అనంతరం ఏ మార్కెట్‌లో పత్తి అమ్మాలనుకుంటున్నారో ఆ వివరాలు ఎంటర్ చేయాలి.అంతేకాదు భూమి సొంతమా, కౌలుదారా చెప్పాలి. పట్టాదారు పాస్ బుక్ నెంబర్, సర్వే నెంబర్, కౌలత రకం, రైతుకు ఉన్న మె?త్తం భూమి, పత్తి సాగు విస్తీర్ణం, పంట రకం లాంటి వివరాలు ఇవ్వాలి. రైతు ఆధార్ కార్డు, పాస్‌బుక్, రైతు ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వీటన్నింటితో కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేయాలి. మార్కెట్, తేదీ, టైమ్‌లోనే రైతుకు సంబంధించిన పత్తి కొనుగోళ్లను అనుమతి ఇస్తారు. సెంటర్ల వద్ద రైతులు వెయిట్ చేయాల్సిన పరిస్థితి తప్పుతుంది. స్మార్ట్‌ఫోన్, వ్యవసాయ అధికారుల వద్ద స్లాట్ బుక్ చేసుకోవచ్చు.పారదర్శకంగా పత్తి సేకరణ, మధ్యవర్తులను అరికట్టడానికి, రైతుల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించడానికి సీసీఐ కపాస్ కిసాన్ యాప్‌ను తీసుకొచ్చింది. గతంలో వ్యాపారులు రైతుల నుండి తక్కువ ధరలకు పత్తిని కొనుగోలు చేసి, తరువాత దానిని సీసీఐకి కనీస మద్దతు ధరకు విక్రయించారు. ఇప్పుడు కార్పొరేషన్ ఈ పద్ధతిని అరికట్టాలని యోచిస్తోందిమెదక్ జిల్లాలోని ఎంపిక చేసిన కొనుగోలు కేంద్రాలలో యాప్ ఆధారిత సేకరణను పైలట్ ప్రాతిపదికన ప్రవేశపెడుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ సంవత్సరం 4.93 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 3.50 లక్షల ఎకరాలు సాగు చేశారు. సిద్దిపేటలో రైతులు 1.08 లక్షల ఎకరాల్లో, మెదక్‌లో కేవలం 35,000 ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు తెలుస్తోంది.

# ఏడుగురు సంతకాలు పెట్టేస్తున్నారే




**విజయవాడ,తెలంగాణ దిశ :**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు డబుల్ గేమ్ ఆడుతున్నారా? అధినేతకు ఒప్పించుకోలేక సతమతమవుతున్నారా? శాసనసభకు హాజరవుతున్నారా? హాజరైతే సభలో ఎందుకు కనిపించరు? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. మంత్రి నారా లోకేష్ వైసీపీ ఎమ్మెల్యేల హాజరుపై మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ శపథం చేసిందని.. అప్పట్లో సభకు హాజరు కాలేదని.. కానీ ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి శపథం చేశారని.. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సభకు వచ్చామని చెప్పి సంతకాలు పెడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కొంతమంది వైసీపీ ఎమ్మెల్యేలు సంతకాలు పెట్టడం పై చర్చ ప్రారంభం అయింది. జగన్మోహన్ రెడ్డి మాత్రం తమకు ప్రతిపక్ష హోదా ఇచ్చేవరకు సభకు హాజరు కామంటున్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ ప్రకటన పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. సంఖ్యా బలంగా ప్రతిపక్ష హోదాకు ఈ సంఖ్య సరిపోదు. అయితే తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు హాజరవుతానని జగన్మోహన్ రెడ్డి తేల్చి చెప్తున్నారు. అయితే ప్రతిపక్ష హోదా అనేది తాము ఇచ్చేది కాదని సీఎం చంద్రబాబు చెబుతున్నారు. కోర్టుకు వెళ్లి తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. ఇంకోవైపు వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం సభకు హాజరు కావాలని కోరుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డికి ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆయన రాజకీయ కారణాలు చెప్పి వారికి చెక్ చెపుతున్నారు. ఇటువంటి తరుణంలో ఏం చేయాలో వైసీపీ ఎమ్మెల్యేలకు పాలు పోవడం లేదు. అందుకే వారు అసెంబ్లీకి వచ్చి సంతకాలు పెట్టి వెళ్ళిపోతున్నట్లు తెలుస్తోంది.వాస్తవానికి వారంతా కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారే. 11 మంది ఎమ్మెల్యేలు ఏడుగురు కొత్తగా శాసనసభకు ఎన్నికయ్యారు. ఆపై ఆర్థికంగా అంత శ్రీమంతులు కూడా కాదు. సభలో అడుగుపెట్టి అధ్యక్షా అనాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ తమ అధినేత జగన్మోహన్ రెడ్డి మాత్రం తమను అదుపు చేస్తున్నారన్న బాధ వారిలో ఉంది. పోనీ కూటమి పార్టీలోకి జంప్ చేస్తామంటే అటు నుంచి ఆహ్వానాలు లేవు. అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు పాటిస్తే అనర్హత వేటు పడుతుందన్న భయం వారిలో ఉంది. ఇంకోవైపు జీతభత్యాలు సైతం కోల్పోతారు.

ఇటువంటి పరిస్థితుల్లో జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు పాటించలేక.. సభ లోపలికి వెళ్లలేక.. సంతకాలు పెట్టి వస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యేలు డబుల్ గేమ్ ఆడుతున్నట్లు కూడా స్పష్టం అవుతోంది. కానీ జగన్ మోహన్ రెడ్డి ఇవేవీ పట్టించుకోవడం లేదు.

ఒకసారి శాసనసభ అధికారులకు కానీ.. సిబ్బందిని కానీ సంప్రదిస్తే ఎంతమంది వైసీపీ నేతలు వచ్చి సంతకం పెడుతున్నారు అన్నది తేలిపోనుంది. కానీ జగన్మోహన్ రెడ్డి అంత సాహసం చేయడం లేదు. అలాగని తమ పార్టీ ఎమ్మెల్యేలు సభకు వెళ్లి సంతకాలు పెడుతున్న విషయం ఆయనకు తెలియదు అని కూడా అనలేము.

# ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్యే!

**శ్రీకాకుళం,తెలంగాణ దిశ :**ఏపీలోకూటమి అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోంది. మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. మరో 15 ఏళ్ల పాటు కూటమి కొనసాగుతుందని అధినేతలు భావిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి చూస్తుంటే అందుకు విరుద్ధంగా ఉంది. మూడు పార్టీల సమన్వయ లోపం స్పష్టమవుతోంది. ఏకంగా అసెంబ్లీ వేదికగా బిజెపి ఎమ్మెల్యే ఒకరు.. టిడిపి ఎమ్మెల్యే పై ఆవేదన వ్యక్తం చేశారు. తనపై కుట్రలు చేస్తున్నారని.. వైసీపీ నేతలతో చేతులు కలిపారని.. వ్యతిరేక మీడియాలో కథనాలు రాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసే పరిస్థితి వచ్చింది. కూటమి పార్టీల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ అవుతోంది. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు.. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పై అసెంబ్లీ వేదికగా సంచలన ఆరోపణలు చేశారు.శ్రీకాకుళం జిల్లాలో పొత్తులో భాగంగా ఎచ్చెర్ల స్థానాన్ని బిజెపికి కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా నడికుదుటి ఈశ్వరరావు పోటీ చేసి గెలిచారు. అసెంబ్లీలో అడుగు పెట్టారు. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గంలో క్వారీలు అధికంగా ఉంటాయి. ఈ తరుణంలో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున క్వారీలకు అనుమతులు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా అప్పట్లో అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే జూన్ 4న ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఆ మరుసటి రోజే ఓ క్వారీ తవ్వకాలకు సంబంధించి వైసీపీ నేతకు భూగర్భ గనుల శాఖ అధికారులు అనుమతులు ఇచ్చారు. సదరు నేత క్వారీలో గ్రావెల్ తవ్వకాలకు సిద్ధపడగా స్థానికులు అడ్డుకున్నారు. అదే విషయంపై ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఆయన సైతం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. క్వారీకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని సూచించారు. అప్పటినుంచి వివాదం నడుస్తూనే ఉందిఅయితే సదరు క్వారీ యాజమాన్యం నుంచి ఎచ్చర్ల ఎమ్మెల్యే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. ముడుపులు ఆశిస్తున్నారని.. ఇవ్వకపోవడం వల్లే ఎమ్మెల్యే వ్యతిరేకిస్తున్నారు అంటూ ప్రభుత్వ వ్యతిరేక మీడియాలో కథనాలు వస్తున్నాయి. అయితే సదరు క్వారీ యజమాని కి అనుకూలంగా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వ్యవహరిస్తున్నారు. భూగర్భ గనుల శాఖ అధికారులపై నేరుగా ఒత్తిడి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఎచ్చెర్ల నియోజకవర్గంలో రవికుమార్ ప్రమేయంపై విమర్శలు ఉన్నాయి. సదరు క్వారీ యజమాని వైసీపీ నేత అయినా.. రవికుమార్ మద్దతు తెలపడం పై మాత్రం కూటమి పార్టీల నేతల్లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. అయితే ఇటీవల వరుస కథనాలు రావడంతో ఎచ్చర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. సాటి కూటమి ఎమ్మెల్యే తనపై ఇలా వ్యవహరించడం పై ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారుప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా నిన్న జీరో అవర్లో ఎచ్చర్ల ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు మాట్లాడారు. తన మనసులో ఉన్న బాధను వ్యక్తపరిచారు. నేరుగా కూన రవికుమార్ పేరు చెప్పకుండా పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే అంటూ సంబోధిస్తూ.. ఆయన తనపై కుట్ర చేశారని.. లేనిపోని ఆరోపణలు చేయిస్తున్నారని.. వ్యతిరేక మీడియాలో కథనాలు రాయిస్తున్నారని.. తనకు ఏ సంబంధం లేదని.. దేవుడు పై ప్రమాణం చేస్తున్నాను అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# సాగర్ బాబు కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి

**పిడుగురాళ్లలో వామపక్ష, ప్రజాసంఘాల నిరసన**

పిడుగురాళ్ల,తెలంగాణ దిశ :పిడుగురాళ్ల తహసిల్దార్ కార్యాలయం వద్ద విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి సాగరబాబు కుటుంబం బలైందని, అతని పోరాటానికి మద్దతుగా, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం అధికారులకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. పిడుగురాళ్ల తహసిల్దారు ఆఫీస్ వద్ద మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి వర్ల సాగర్ బాబుకి విద్యుత్ అధికారులు మోసం చేయడాన్ని నిరసిస్తూ గత 13 రోజుల నుండి నకరికల్లు మండలం చేజర్లలో నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నాడని దానికి మద్దతుగా బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ, కారంపూడి మండలం పెదకోదమగుండ్ల గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం వెంకటేశ్వర స్వామి రథోత్సవం జరుగుతుంటే 11 కేవీ విద్యుత్ తీగలు అడ్డుగా ఉన్నయని వాటిని తొలగించాలని ప్రైవేటుగా కరెంటు పనులు చేసుకుని జీవిస్తున్నటువంటి సాగర్ బాబుని బలవంతంగా స్థంభంపై ఎక్కించి కరెంటు కనెక్షన్ ఆపకుండా ఉండడంతో షాక్ కొట్టి స్తంభం పై నుండి కిందపడి కాళ్ళు చేతులు కోల్పోయి వికలాంగుడిగా మారాడు అని అన్నారు. ఈ స్థితికి కారణమైన విద్యుత్ శాఖ లైన్మెన్ యం. వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ లైన్మెన్ పరబ్రహ్మాచారి, లైన్ ఇన్స్పెక్టర్, ఏఇలపై చర్యలు తీసుకోవాలని వివిధ రకాల అధికారులకు తెలియజేసి, చివరకు బాధిత కుటుంబం తన అత్తమామల ఊరైన చేజర్లలో దీక్షలు చేస్తున్నారని, విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకొని దళితుడైన సాగర బాబుకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శీను, సిపిఐ మండల కార్యదర్శి బాలయ్య, ఎం సి పి ఐ జిల్లా కార్యదర్శి ఓర్స్ కృష్ణ, అంబేద్కర్ ప్రచార సమితి అధ్యక్షుడు దేగల అబ్రహం, మాల మహానాడు గోదా బాల, కే కుమార్ ఆర్టి ఐ, పిడిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె. శ్రీనివాసరావు, పిడియం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్వలి, ప్రసాదు, మాల మహానాడు మహిళా నాయకురాలు చిట్టిమల్ల మేరీ, జి కీర్తన, ఎస్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

**- అపోలో ఫార్మసీలు నమ్మకానికి, సేవకు ప్రతీకలు**

**- వరల్డ్ ఫార్మసిస్టుల దినోత్సవంలో విసి డా. వినోద్ భట్**

**చిత్తూరు,తెలంగాణ దిశ :**ఆరోగ్య రంగంలో విశేష కృషికి అంకితం అయిన ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం ? 2025ను అపోలో విశ్వవిద్యాలయం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ ముఖ్య అతిథిగా హాజరై ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రాజ్వలనతో ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా డా. వినోద్ భట్ మాట్లాడుతూ... ఔషధ నిపుణులు ఆరోగ్య రంగంలో కీలక భాగస్వాములు. రోగుల ఆరోగ్య సంరక్షణ, మందుల సురక్షిత వినియోగం, నాణ్యత మరి యు సరైన సూచనల విషయంలో వారి పాత్ర అపారమైనది. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టుల సేవలు సమాజంలో విశేష గుర్తిం పు పొందాయి. ఫార్మసిస్టులు కేవలం మందులు ఇవ్వడమే కాదు, ప్రజల్లో మందుల వినియోగంపై అవగాహన కల్పించడం, దుష్ప్రభావాలను నివారించడం కూడా వారి బాధ్యత అని పేర్కొన్నారు. అపోలో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మసీ నెట్‌వర్క్‌ను నడుపుతోంది. దేశవ్యాప్తంగా 6,500 మందుల ఔట్‌లెట్లు ఉన్నాయి. ప్రపంచంలోని 12 అగ్రగణ్య ఫార్మసీలలో అపోలో ఒకటి. ఆన్‌లైన్ మెడిసిన్ సేవలలో కూడా అపోలో ముందున్నది. పేషంట్ల ఆరోగ్య పరిస్థితిని ఫోన్ ద్వారా తెలుసుకోవడం, అపోలో ఫార్మసీ సేవల అత్యంత విశ్వసనీయతకు నిదర్శనమని భట్ అన్నారు. ఈ సందర్భంలో అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ (ంఎఖూ) డీన్ ప్రొఫెసర్ కె. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవం మనకు ఫార్మసీ రంగంలోని బాధ్యతలను గుర్తు చేయిస్తుంది. ఫార్మసిస్టులు కేవలం మందులు ఇస్తే సరిపోదు, ప్రజలకు మందుల వినియోగం, భద్రత, ఆరోగ్య పరిరక్షణలో అవగాహన కల్పించడం ముఖ్యం. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టుల సేవలు స్ఫూర్తిదాయకం' అని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు

ప్రపంచ ఔషధ నిపుణుల దినోత్సవ ప్రాముఖ్యతను వివరించే వీడియో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సృజనాత్మక స్కిట్ ప్రదర్శన ద్వారా ఫార్మసీ రంగంలో అవగాహన, భద్రతా ప్రాధాన్యత గురించి స్పష్టమైన సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో గౌరవ అతిథి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, డీన్లు డాక్టర్ రామయ్య ఇటుమల్ల, డాక్టర్ జగదీషన్, ఎఐఎంఎస్ఆర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ సచ్చితానంద ఆడిగ, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, అలయిడ్ హెల్త్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ సుచరిత పి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన సర్వీసుల మంజూరు వేగవంతం చేయండి...

## సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**నూతన సర్వీస్ కనెక్షన్ల కోసం పెండింగ్ లో వున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, దీని కోసం రేపు (శనివారం) ఇస్తున్న లైన్ క్లియరెన్స్ లను సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, విద్యుత్ అధికారులను ఆదేశించారు.


చీఫ్ ఇంజినీర్, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో నూతన సర్వీసులు, టైటిల్ ట్రాన్స్ ఫర్, సోలార్ నెట్ మీటరింగ్, పీఎం సూర్యఘర్ పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 593 ఎల్టీఎం ఓ (అపార్ట్మెంట్/ లే అవుట్) దరఖాస్తులు డిపార్ట్మెంట్ వద్ద పెండింగ్ లో వున్నాయి. వాటిని వెంటనే రిలీజ్ చేయాలని ఆదేశించారు. గతం లో నూతన ఎల్టీఎం సర్వీసుల ఛార్జింగ్ కోసం ఫీడర్ ను నిలిపివేసేవారని, దాని వలన సరఫరా లో ఇబ్బందులు ఏర్పడేవన్నారు. నూతన సర్వీసుల ఛార్జింగ్ కోసం ఎప్పుడు పడితే అప్పుడు సరఫరా నిలిపివేయకుండా ఉండేందుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినట్టు సీఎండీ తెలిపారు. దీని ప్రకారం, ఎల్టీఎం కనెక్షన్లు ఛార్జ్ చేసేందుకు గాను శనివారం లైన్ క్లియరెన్స్ ఇవ్వనున్నామని సీఎండీ తెలిపారు. సంబంధిత అధికారులు ముందుగా లైన్ క్లియరెన్స్ షెడ్యూల్ ను రూపొందించి , ఏ ప్రాంతంలో ఎంత సేపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారో ఆ ప్రభావిత ఫీడర్ల పరిధిలోని వినియోగదారులకు తెలియజేయాలని సీఎండీ ఆదేశించారు.ఎల్సీఅ సమయంలో చెట్ల కొమ్మలు కొట్టేయడం, డీటీఆర్‌ల వద్ద ఏబీ స్విచ్ ల మరమ్మతులు సైతం చేపట్టాలని సీఎండీ తెలిపారు.సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రతి మంగళవారం,సర్కిళ్ల వారీగా అత్యధికంగా సరఫరా ఫిర్యాదులు నమోదయ్యే ప్రాంతాల్లో పర్యటనలు చేస్తూ ఎల్టీ నెట్వర్క్ ను తనిఖీ లు చేయడం, స్థానిక ప్రజలతో మాట్లాడుతూ సంస్థ పనితీరుని అడిగి తెలుసుకుంటున్నారు. దానిలో భాగంగా ఈ రోజు పాత బస్తీలోని హుస్సేనీ ఆలం, మొగల్ పురా పరిధిలోని బేహరుపియా బస్తీ, గొల్ల ఖిడికి బస్తీలోని చిన్న చిన్న గల్లీల్లో బైక్ మీద తిరుగుతూ నెట్వర్క్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ డా. నరసింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ శ్రీ ప్రభాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నెయ్యితో యవ్వనం!



నెయ్యి.. ఆహారానికే కాదు, అందానికీ మెరుగులు అద్దుతుంది. ముఖ్యంగా.. చర్మ సంరక్షణలో దివ్యంగా పనిచేస్తుంది. నిత్యం యవ్వనంగా కనిపించేందుకు సాయపడుతుంది. ప్రతిరోజూ భోజనానికి ముందు ఒక చెంచా నెయ్యి తీసుకుంటే.. చర్మంలో అద్భుతమైన మార్పు కనిపిస్తుంది.చర్మం యవ్వనంగా కనిపించాలని, ముడతలు తగ్గించుకోవాలని.. యాంటి ఏజింగ్ ఉత్పత్తులకు వేలకు వేలు ఖర్చు చేస్తుంటారు. కానీ, నెయ్యి.. సహజంగానే కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. యాంటి ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే నెయ్యి.. శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. దీర్ఘకాలంలో చర్మాన్ని మెరుగుపరుస్తుంది. ఎలాంటి సింథటిక్ ఉత్పత్తులను ఉపయోగించకుండానే.. చర్మాన్ని యవ్వనంగా, దృఢంగా, కాంతిమంతంగా మార్చేస్తుంది.చలికాలంలో చర్మం పొడిబారకుండా.. ముఖం, పెదవులకు నెయ్యి రాసుకోవడం తాతమ్మల కాలం నుంచే ఉన్నది. చర్మాన్ని తేమగా ఉంచడంలో నెయ్యి సాయపడుతుంది. ఇది చర్మ పొరల్లోకి చొచ్చుకుపోయి.. లోపలి నుంచి పునరుజ్జీవ శక్తిని అందిస్తుంది. సహజ మాయిశ్చరైజర్‌లా పనిచేసి.. చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. నెయ్యిలో లభించే విటమిన్ డి.. కొత్త కణాల పెరుగుదలకు తోడ్పడుతుంది. చర్మం ఎల్లవేళలా యవ్వనంగా కనిపించేలా చూస్తుంది. నెయ్యిలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, ఫ్యాటీ యాసిడ్స్.. కళ్ల కింద నల్లని వలయాలను దూరం చేస్తాయి. ముఖ వర్చస్సును పెంచుతాయి. నెయ్యిలోని యాంటి ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు.. చర్మ సమస్యలను దూరం చేస్తాయి. చర్మం ఎర్రబడటం, దురద, మంటను నివారించడంలో.. నెయ్యిలో ఉండే బ్యూట్రిక్ యాసిడ్ సమర్థంగా పనిచేస్తుంది.

# వైసీపీలో నెంబర్ 2 రచ్చ




**తిరుపతి,తెలంగాణ దిశ :**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్ తరువాత ఎవరు? అధినేత తరువాత స్థానం ఎవరిది? జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచేది ఎవరు? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైసిపి ఆవిర్భావం నుంచి జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఒక వలయం పనిచేసింది. విజయసాయిరెడ్డి, వై వి సుబ్బారెడ్డి, సజ్జల రామకృ ష్ణారెడ్డి, పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి.. ఇలా ఒక రక్షణ వలయం ఉండేది. కానీ ఇప్పుడు కొందరు నేతలు పార్టీకి దూరమయ్యారు. మరికొందరు కేసుల్లో చిక్కుకొని జైలు పాలు అయ్యారు. ఈ క్రమంలో జగన్మోహన్ రెడ్డి ఒంటరి అయ్యారు. సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి వారు ఉన్నా.. జగన్మోహన్ రెడ్డి సొంత మనుషులకు నియమించుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మారిన రాజకీయ పరిస్థితులు, ముసురుకొస్తున్న కేసులు దృష్ట్యా జగన్మోహన్ రెడ్డి ముందు ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తన భార్య భారతి రెడ్డిని రాజకీయాల్లోకి తేవాలని.. పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉన్న సమయంలో కుటుంబ సభ్యులు ఎవరు రాజకీయాల్లోకి రాలేదు. ముఖ్యంగా కుటుంబంలో మహిళలు రాజకీయాలకు దూరంగా ఉండేవారు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో.. జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడేందుకు ముందుకు వచ్చారు తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల. కొడుకు కోసం పులివెందులలో పోటీ చేశారు విజయమ్మ. కాంగ్రెస్ అధినాయకత్వంతో విభేదించి మరి రంగంలోకి దిగారు. చెల్లెలు షర్మిల అయితే ఊరు వాడ ప్రచారం చేశారు. అన్న జగన్మోహన్ రెడ్డి కోసం ఏకంగా పాదయాత్ర చేశారు. తన అన్న జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చేందుకు పరితపిం చారు. కానీ ప్రస్తుతం జగన్మోహన్ రెడ్డికి తల్లి, చెల్లి ఇద్దరూ దూరమ య్యారు.జగన్మోహన్ రెడ్డితో సుదీర్ఘకాలం ప్రయాణం చేశారు విజయసాయిరెడ్డి. రాజకీయాల్లోకి రాకమునుపే జగన్మోహన్ రెడ్డితో మంచి సంబంధాలు కొనసాగించేవారు. ఈ క్రమంలోనే జగన్ అవినీతి కేసుల్లో విజయసాయిరెడ్డి కూడా 16 నెలలు పాటు జైల్లో ఉండి పోయారు. వైసిపి ఆవిర్భావంలో విజయసాయిరెడ్డి పాత్ర కీలకం. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అన్ని విధాల కృషి చేశారు విజయసాయిరెడ్డి. జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరిచే క్రమంలో విజయసాయిరెడ్డి చేసే కృషి అంతా అంతా కాదు. అటు వంటి విజయసాయిరెడ్డి ఇప్పుడు పార్టీకి గుడ్ బై చెప్పారు. మరోవైపు బాబాయ్ వైవి సుబ్బారెడ్డి యాక్టివ్ గా లేరు. పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సైతం అరెస్ట్ అవుతారని ప్రచారం నడుస్తోంది. ఇటువంటి సంక్లిష్ట సమయం కొనసాగుతున్న నేపథ్యంలో.. తనకు అండదండగా నిలిచేందుకు తన భార్య భారతి రెడ్డిని జగన్ రంగంలోకి దించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారతి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో తరచూ ఫోన్లో మాట్లాడుతూ పార్టీ స్థితిగతులను తెలుసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ప్రజల ప్రాణాలనుకాపాడేందుకు కలిసి శ్రమిద్దాం..

## జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం,తెలంగాణ దిశ :**జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారుల ను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా రోడ్డు భద్రతకు సంబంధించి, తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత శాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో మోటారు వాహనాలు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం,అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతు న్నాయ న్నారు. ప్రమాదాల భారిన పడిన వారి కుటుంబ సభ్యులు అనాధలవుతు న్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, ఆర్ అండ్ బీ, వైద్యశాఖల అధికారులు సమన్వయం తోపనిచేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి, జైలు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ప్రతి ద్విచక్రవాహ నదారుడు హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసుశాఖనుఆదేశించారు.జాతీయ రహదా రిలో ప్రమాదాల నివారణకు రబ్బరు వేగ నియంత్రికలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని రవాణాశాఖను ఆదేశించారు. రహదారుల కూడళ్లు, ధాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో శ్రమిద్దామని కలెక్టర్అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ చందన, పంచా యతీ రాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఇల్లందు శ్రీకాంత్, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్టీవో వెంకటరమణ, కొత్తగూడెం నేషనల్ హైవే డి ఈ శైలజ, మెడికల్ డిపార్ట్మెంట్ వీరబాబు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో బూమ్ రాంగ్ అవుతోందా..?

**కరీంనగర్,తెలంగాణ దిశ :** కొంతకాలంగా సిరిసిల్ల కలెక్టర్ మీద భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆయన ఎప్పుడు సిరిసిల్ల వెళ్ళినా సరే.. తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. కేటీఆర్ అనుచర వర్గం కూడా ఆ కలెక్టర్ మీద అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్లలో అడ్డగోలుగా అక్రమాలు జరిగాయని.. ఆ అక్రమాలను ప్రస్తుత సిరిసిల్ల కలెక్టర్ బయట పెడుతున్నారని.. రేవంత్ అందుకోసమే ఆయనను సిరిసిల్ల పంపించారని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కేటీఆర్ ఏ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ.. ఆయన అనుచరులు ఏ స్థాయిలో మండిపడినప్పటికీ అక్కడి కలెక్టర్ మాత్రం తన శైలిని మాత్రం మార్చుకోలేదు. వాస్తవానికి కేటీఆర్ అనుచరులు చేసిన అక్రమాలను బయటికి తీసే క్రమంలో ఆయన అదే దూకుడు కొనసాగించి ఉంటే బాగుండేది. కానీ ఓ నిర్వాసితురాలి విషయంలో ఆయన వ్యవహరించిన తీరు ఏకంగా హైకోర్టు దాకా వెళ్ళింది. ఆయనకు మాత్రమే కాదు.. ప్రభుత్వానికి కూడా మొట్టికా యలు పడేలా చేసింది.సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా పనిచేస్తున్నారు. అయితే ఇటీవల ఆయన మిడ్ మానేరు నిర్వాసి తురాలు వనభట్ల కవిత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆయనకు పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆయన పట్టించుకోలేదు. పైగా ఆర్డీవో, ఎమ్మార్వోకు చెప్పి కేసులు నమోదు చేయించారు. దీంతో కవిత మరోసారి హైకోర్టును ఆశ్రయిం చారు. అయితే గతంలో ఇదే పిటిషన్ మీద హైకోర్టుకు సందీప్ కుమార్ హాజరయ్యారు. ఆ సమయంలో ఆయన వేసుకున్న డ్రెస్ పట్ల హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టుకు వచ్చే ప్రొసీడిం గ్ తెలియదా.. కోర్టుకు వచ్చే విధానం ఇదేనా అంటూ కలెక్టర్ మీద హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది.కవిత మరొకసారి హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో.. ఈసారి హైకోర్టు న్యాయమూర్తులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో బాధితురాలికి పరిహారం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును యధావిధిగా అమలు చేయాల ని హైకోర్టు ఆదేశించింది. సక్రమంగా అమలు చేయాలని ప్రభు త్వానికి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి హైకోర్టు సూచించింది. అంతేకా దు కలెక్టర్ ను చూస్తే భయం వేస్తోందని.. ఆయన డ్రెస్సింగ్ సెన్స్బా గోలేదని..ఇలాంటి వ్యక్తి ప్రజలకు ఎలా సేవ చేస్తారని హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. వాస్తవానికి ఇటీవలికాలంలో ఒక కలెక్టర్ మీదఈ స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడం ఇదే తొలిసారి. కేటీఆర్, ఆయన అనుచరులుఅక్రమాలు వెలుగులోకి తేవాలని సందీప్ కుమార్ ని పంపిస్తే.. రేవంత్ లక్ష్యం నెరవేరకపోగా.. పైగా హైకోర్టు నుంచి చివాట్లు ఎదురయ్యాయని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

# పార్టీ మారితే కేసులు ఉండవా


**ఏలూరు,తెలంగాణ దిశ :**రాజకీయాలు అంతే... రాజకీయాల్లో ఓపిక.. సహనం అవసరం.. అధికారం లేకపోతే పార్టీ మారితే ఎవరూ కేర్ చేయరు. పక్కన ఉండే నలుగురైదుగురు కోటరీ నాయకులు తప్ప ఎవరూ పెద్దగా కలిసేందుకు కూడా ఆసక్తి చూపరు. ప్రస్తుతం మాజీ మంత్రి ఆళ్లనాని పరిస్థితి అలాగే తయారైంది. ఆళ్ల నాని వైసీపీలో ఒక వెలుగు వెలిగారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా ఏదో ఒక పదవి పొందారు. అలాగనుకుంటే వైసీపీ అధికారంలోకి రాకముందే ఆళ్లనానిని జగన్ ఎమ్మెల్సీ చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ చీఫ్ జగన్ తన కేబినెట్ లో చోటు కల్పించడమే కాకుండా మొదటి విడతలోనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా చేశారు. అయితే వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆళ్లనాని వైసీపీని వీడి టీడీపీలో చేరిపోయారు.... తొలి నుంచి ఆళ్ల నాని టీడీపీ చేరికకు ఆ పార్టీ నేతలు అంగీకరించలేదు. ఏలూరు జిల్లా టీడీపీ నేతలు ఆళ్ల నాని పార్టీలో చేరికపై తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో పలు సార్లు ఆయన చేరికకు బ్రేకులు పడినా చివరకు పార్టీ నాయకత్వం ఏలూరు జిల్లా నాయకులకు నచ్చ చెప్పి పార్టీ కండువా కప్పేసింది. సీనియర్ నేతల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ ఆళ్ల నాని పార్టీలో చేరడాన్ని ఇప్పటికీ జీర్ణించుకోవడం లేకపోతున్నారు. అసలు జిల్లాలో ఆళ్లనాని అంటూ ఒక నేత ఉన్నారన్న విషయం ఇటు టీడీపీ నేతలతో పాటు ఆయన అనుచరులు కూడా మర్చిపోయారట. ఏలూరు జిల్లాను ఒకప్పుడు వైసీపీ హయాంలో శాసించిన నాని ఇప్పుడు వేళ్లు విరుచుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. పార్టీలో చేరి ఎనిమిది నెలలు కావస్తున్నా బయటకు రావడం లేదు. చివరకు పార్టీ కార్యక్రమాలకు కూడా ఆళ్లనానికి పిలుపులు లేవు.

అసలు ఆళ్లనానిని తమ నాయకుడిగా టీడీపీ నేతలు గుర్తించడం లేదు.వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తమపై పెట్టిన అక్రమ కేసులకు ఆళ్ల నాని ప్రధాన కారణమని భావించడం వల్లనే అంతటి వ్యతిరేకతను టీడీపీ క్యాడర్, లీడర్ల నుంచి ఆళ్ల నాని ఎదుర్కొంటున్నారు. అలాగని నిన్న గాక మొన్న పార్టీలో చేరి స్థానిక నాయకత్వం తీరుపై అధినాయకత్వానికి ఫిర్యాదు చేసే పరిస్థితి కూడా లేదు. దీంతో ఆళ్ల నాని అనవసరంగా పార్టీ మారానా? అన్న బాధలో ఉన్నారట. వచ్చే ఎన్నికల్లో ఆళ్ల నానికి టీడీపీ టిక్కెట్ దొరకడం కూడా కష్టమేనని అంటున్నారు. దీంతో ఆళ్లనాని మరొకసారి జగన్ కు దగ్గరయ్యే ప్రయత్నాలు కూడా చేస్తున్నారంటున్నారు.

# మాజీ సీఎం కుమారుడి అరెస్టు

న్యూఢిల్లీ, : ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కొడుకు చైతన్య బఘేల్ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో అంటి కరప్షన్ బ్యూరో , ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్ సెప్టెంబర్ 24, బుధవారం చైతన్యతో పాటు మరో వ్యక్తి దీపెన్ చావ్డాను కూడా అదుపులోకి తీసుకున్నాయి. ఇద్దరినీ ప్రత్యేక ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ కోర్టులో హాజరుపరిచారు, అక్టోబర్ 6 వరకు వారిని ఏసీబీ/ఈఓడబ్ల్యూ కస్టడీకి అప్పగించారు. 2019 నుంచి 2022 వరకు భూపేశ్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ లిక్కర్ స్కామ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్ విలువ దాదాపు 2,500 కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ప్రకారం, చైతన్య బఘేల్ ఈ స్కామ్లో కీలక పాత్ర పోషించారు. ఈ కుంభకోణంలో సుమారు 1,000 కోట్ల రూపాయల అక్రమ ఆదాయాన్ని చైతన్య నిర్వహించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. అక్రమ నిధులను దాచడానికి, బదిలీ చేయడానికి ఇతర సభ్యులతో కలిసి కుట్ర పన్నినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ స్కామ్లో మద్యం అమ్మకాల నుంచి కమీషన్లు, చట్టవిరుద్ధమైన మద్యం అమ్మకాల ఆదాయం, రాష్ట్రంలో లాభదాయకమైన మద్యం వ్యాపారాన్ని నియంత్రించేందుకు డిస్టిలర్లతో కుమ్మక్కై లంచాలు తీసుకోవడం వంటివి ఉన్నాయి. చైతన్య బఘేల్ తరపు న్యాయవాది ఫైసల్ రిజ్వీ ఈ అరెస్టును తీవ్రంగా వ్యతిరేకించారు. చైతన్యపై ఎలాంటి ఆధారాలు లేకుండానే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఏసీబీ/ఈఓడబ్ల్యూ దాఖలు చేసిన ప్రధాన చార్జ్షీట్ ఆ తర్వాత సమర్పించిన అనుబంధ చార్జ్షీట్లలో చైతన్య పేరు నిందితుడిగా లేదని ఆయన స్పష్టం చేశారు. 45 మంది నిందితుల్లో 29 మందిని ఎప్పుడూ అరెస్ట్ చేయలేదని, ఎందుకు చైతన్యను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నారని ఆయన ప్రశ్నించారు. మరో నిందితుడు లక్ష్మీ నారాయణ్ బన్సాల్ ఇచ్చిన వాంగ్మూలంలోనే చైతన్య పేరు వచ్చిందని రిజ్వీ తెలిపారు.

# పెరిగిన బంగారం..!



ముంబై, : బంగారం ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. అమెరికా హెచ్-1బీ వీసా రుసుము పెంపుదల ప్రభావం కూడా దీనిపై కనిపిస్తోంది. రూపాయి విలువ మరింత దిగజారడంతో దేశ రాజధాని ఢిల్లీలో బంగారం ధర రూ. 2,700 పెరిగి రూ. 1,18,900కు చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి గత మార్కెట్ సెషన్లో పది గ్రాములకు రూ. 1,16,200 వద్ద ముగిసింది.అమెరికా డాలర్తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం వల్లనే బంగారం ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత క్యాలెండర్ ఏడాదిలో బంగారం ధర 10 గ్రాములకు రూ. 39,950 పెరిగింది. గతేడాది డిసెంబర్ 31 బంగారం ధర రూ. 78,950 వద్ద ముగిసిన విషయం తెలిసిందే.వెండి ధరలు కూడా అదే బాటలో పయనిస్తున్నాయి. కిలో వెండి రూ. 3,220 పెరిగి రూ. 1,39,600కు చేరి, సరికొత్త గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. ఈ క్యాలెండర్ ఏడాదిలో వెండి ధర ఏకంగా రూ.49,900 పెరిగింది. డిసెంబర్ 31న వెండి ధర రూ. 89,700గా ఉంది. మరోవైపు, డాలర్ మారకంతో రూపాయి మంగళవారం 47 పైసలు క్షీణించి 88.75కు పడిపోయింది.పసిడి పరుగులు ఒక్క రోజులోనే రూ. 2 వేలు పెరగడం ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. దీపావళి నాటికి బంగారం ధరలు భారీగా పెరుగుతాయని అంతా అనుకుంటే, దానికి ముందే ధరలు ఈ స్థాయికి చేరుకోవడం అందరికీ ఆందోళనకు గురిచేస్తోంది. బంగారం ధరలు పెరగడానికి ప్రధానంగా అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్నటువంటి పరిస్థితులే కారణమని చెప్పవచ్చు. ముఖ్యంగా బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వారికి పెరిగిన ధరలు ఇబ్బందికరంగా ఉన్నాయనే చెప్పాలి.

# సూర్యరావు వర్సెస్ అమూల్య

**రాజమండ్రి,,తెలంగాణ దిశ :**అన్నా చెల్లెళ్ల మాటల యుద్ధం, అన్నా దమ్ముళ్ల మధ్య మాటల తూటాలు తెలుగు రాష్ట్రాల్లో ఎప్పటికీ హాట్ టాపిక్ అవుతుంటాయి. సంచలనం.. ఎందుకంటే ఏపీలో అన్నా చెల్లి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైఎస్ షర్మిలా రెడ్డి రాజకీయ ప్రత్యర్థులుగా మారితే.. తెలంగాణాలో కేటీఆర్, కవిత ల మధ్య ఎటువంటి పొలిటికల్ వాతావరణం నెలకొందో చెప్పనక్కర్లేదు. ఇటువంటి పరిణామాలు కేవలం ముఖ్యమంత్రి స్థాయి కుటుంబాల్లోనే అనుకుంటే పొరపాటే... ఏపీలోని ఓ మాజీ మంత్రి ఇంట్లోనూ తండ్రి, కూతురు మధ్య ఓ చిన్నపాటి యుద్ధ వాతావరణమే నెలకొంది.. దీనికి అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రాజోలు నియోజకవర్గం వేదికగా మారింది.. మాజీ మంత్రి, వైసీపీ నేత గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్య కు రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించడం హాట్ టాపిక్ అవుతోంది. పొలిటికల్ తెరమీద తండ్రి వర్సెస్ కూతురు కథ అందరి దృష్టిలో ఆసక్తిని నెలకొల్పింది.. రాష్ట్ర విభజన, నియోజకవర్గాల పునర్విభజనకు ముందు అల్లవరం ఎస్సీ కానిస్టెన్సీ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి తొలిసారిగా ఎమ్మెల్యే అయిన గొల్లపల్లి సూర్యారావు 2004లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి గెలుపొంది వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్యాబినేట్లో మంత్రిగా కూడా పనిచేశారు.. ఆతరువాత కాంగ్రెస్ పార్టీకు రాజినామా చేసి మళ్లీ టీడీపీలో చేరి 2014 ఎన్నికల్లో రాజోలు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు.. 2019లో టీడీపీ తరపున పోటీచేసి ఓటమి చెంది 2024 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకుని రాజోలు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు.. ప్రస్తుతం ఆయన రాజోలు నియోజవకవర్గ వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.. ఈ పరిస్థితుల్లో టీడీపీ అధిష్టానం గొల్లపల్లి సూర్యారావుకు షాక్ నిచ్చే ప్రకటన విడుదల చేసింది.. టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇంచార్జ బాధ్యతలను గొల్లపల్లి కుమార్తె గొల్లపల్లి అమూల్యకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది.. దీంతో రాజోలు రాజకీయం రసవత్తరంగా మారింది.. 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన క్రమంలో గొల్లపల్లి సూర్యారావు కుటుంబం కూడా రాజోలు నియోజకవర్గంలో ఆయనకు సహకారంగా ప్రచారం చేసింది.. ఈక్రమంలోనే గొల్లపల్లి అమూల్య రాజోలు నియోజకవర్గంలో 2014 నుంచి 2024 వరకు రాజోలు టీడీపీ నాయకులతో, కార్యకర్తలతో పరిచయాలు పెంచుకోవడమే కాదు.. ఏకంగా గత అయిదేళ్లుగా నియోజవర్గ పరిధిలోని జగ్గన్నపేటలో నివాసం ఉంటోంది.. ఈక్రమంలోనే 2024 ఎన్నికల్లో టీడీపీ తరపున తాను బరిలో ఉన్నానంటూ టిక్కెట్టు కోసం దరఖాస్తు చేసుకోవడంతో కుటుంబంలో వివాదం మొదలయ్యింది. గొల్లపల్లి సూర్యారావు, ఆయన కుమారుడు శ్రీధర్లు అమూల్యను పూర్తిగా పక్కన పెట్టేసినట్లు ప్రచారం జరిగింది.ఒక దశలో రాజోలు టిక్కెట్టు అమూల్యకే ఇస్తున్నారంటూ ప్రచారం కూడా జరిగింది.. అయితే అనూహ్యంగా జనసేన తరపున జనసేన అధినేత పవన్ కళ్యాణ్తో అత్యంత సన్నిహితంగా ఉండే మాజీ ఐఏఎస్ అధికారి దేవా వరప్రసాదరావు సీన్లోకి ఎంట్రీ ఇవ్వడంతో రాజోలు స్థానం జనసేన ఎగరేసుకుపోయింది.. ఈక్రమంలో అయోమయంలో పడిన గొల్లపల్లి సూర్యారావు వైసీపీ ఇచ్చిన ఆఫర్ను స్వీకరించి రాజోలు నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. అయితే ఆయన కుమార్తె గొల్లపల్లి అమూల్య మాత్రం టీడీపీలోనే కొనసాగుతూ చురుగ్గా వ్యవహరించింది.. దీంతో పార్టీ అధిష్టానం దృష్టిలో గుర్తింపు పొంది ఇప్పుడు నియోజకవర్గ ఇంచార్జ్ స్థాయిని అందుకున్నారు.. రాజోలు నియోజకవర్గంలో జనసేన పార్టీ నుంచి ఎమ్మెల్యే దేవవరప్రసాద్ ప్రాతినిధ్యం వహిస్తుండగా వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్తగా గొల్లపల్లి సూర్యారావు ఉన్నారు. మధ్యలో వైసీపీకు పూర్తి ఆపోజిట్ పార్టీగా ఉన్న టీడీపీ నుంచి ఆయన కుమార్తె అమూల్య ఉండడం వైసీపీకు కొరకరాని కొయ్యలా మరిందంటున్నారు.. ఐవీఆర్ ఎస్ ద్వారా నియోజకవర్గంలో అభిప్రాయ సేకరణ చేపట్టిన టీడీపీ అధిష్టానంకు అమూల్య కు మద్దతు తెలుపుతూ 70 శాతంకు పైగా తమ అంగీకారం తెలిపారని తెలుస్తోంది.. పైగా పార్టీ బలోపేతంకు కృషిచేస్తూనే ప్రభుత్వం కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జనసేన ఎమ్మెల్యే వరప్రసాదరావుతో కలిసి పనిచేస్తానని అమూల్య ప్రకటించారు. దీంతో రాజోలు నియోజకవర్గంలో తండ్రీకూతుర్ల మధ్య మాటల యుద్ధం ఏస్థాయిలో ఉంటుందో అంటూ చర్చించుకుంటున్న పరిస్థితి

## 150 కోట్ల నుంచి 300 కోట్లకు..

# పెళ్లితో పీక్‌లో స్టార్ కపుల్



ఒక స్టార్ లైఫ్ లో సెటిలయ్యాడా లేదా ఎలా చెప్పగలం. అతడి సక్సెస్ రేటు- ఫ్యాన్ ఫాలోయింగ్, సొంత గృహాలు- హోదా, పారితోషికం, లగ్జరీ కార్లు, వ్యాపారాల్లో పెట్టుబడులు, భవిష్యత్ కమిట్ మెంట్లు.. ఇవన్నీ చూడాలి. ఆ రకంగా చూస్తే,



ఇప్పుడు విజయ్ దేవరకొండ- రష్మిక మందన్న అలయెన్స్ లైఫ్ లో ఫుల్ గా సెటిలైనట్టేనని ఫైనాన్షియల్ ఎక్స్ పర్ట్స్ అంచనా వేస్తున్నారు. ఈ జంట నికర ఆస్తుల విలువ సుమారు 150 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. విజయ్ దేవరకొండ ఒక్కో సినిమాకి 15 కోట్ల మేర పారితోషికం అందుకుంటుంటే, రష్మిక మందన్న ఏడాదికి నాలు గైదు సినిమాల్లో నటించేస్తూ ఏకంగా ఒక్కో సినిమాకి 4 నుంచి 12 కోట్ల వరకూ అం దుకుంటోంది. బాలీవుడ్ లో సికందర్ సినిమాలో నటించినందుకు 13 కోట్లు అందుకుందని సమాచారం ఉంది. పుష్ప 2 కోసం 10 కోట్లు అందుకున్న రష్మిక తదుపరి బాలీవుడ్ చిత్రాలకు భారీ మొత్తంలో పారితోషికాలు అందుకుంటోంది. విజయ్ కి జూబ్లీహల్స్ లో 15 కోట్ల ఖరీదైన సొంత ఇల్లు ఉంది. అలాగే ఖరీదైన కార్లు అతడి సొంతం.రూ.65 -68 లక్షల విలువైన బీ ఎండబ్ల్యూ 5 సిరీస్, రూ.75 లక్షల విలువైన ఫోర్డ్ ము స్తాంగ్, రూ.64 లక్షల విలువైన రేంజ్ రోవర్ , రూ.85 లక్షల విలువైన వోల్వో %శజ%90 ఉన్నాయి. దేవరకొండ నికర ఆస్తుల విలువ సుమారు 70 కోట్ల వరకూ ఉంటుందని ఒక అంచనా. బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌కు రూ.1 కోటి, ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌కు దాదాపు రూ.40 లక్షలు సంపాదిస్తాడు. అతడు రౌడీ బ్రాండ్ దుస్తులను యూత్ లో బాగా ఎక్కించాడు. అతడికి ఇది కూడా ఒక ప్రధాన ఆదాయవనరుగా మారింది. రష్మిక మందన్న నికర ఆస్తుల విలువ సుమారు 66 కోట్లు. ఈ బ్యూటీకి బెంగళూ రులోరూ. 8 కోట్ల విలువైన విలాసవంతమైన ఇల్లు, ముంబై, గోవా, కూర్గ్ (స్వస్థలం), హైదరాబాద్ (మెట్టినిల్లు)లలో ఆస్తులు ఉన్నాయి. ఖరీదైన కార్లు తన గ్యారేజీలో ఉన్నాయి. ఆడి క్యూ3, రేంజ్ రోవర్ స్పోర్ట్, టయోటా ఇన్నోవా, హ్యుందాయ్ క్రెటా, మెర్సిడెస్-బెంజ్ సి-క్లాస్ కార్లను తన సొంతం చేసుకుంది. విజయ్ - రష్మిక ఔటిం గుల కోసం ఖర్చు లక్షల్లోనే ఉంటుంది. ఈ జంట నిశ్చితార్థం సైలె ంట్ గా కానిచ్చేసి, ఫిబ్రవరిలో మనువాడేందుకు అద్భుతమైన డెస్టినే షన్ వెడ్డింగ్ వెతుకుతున్నారని కథనాలొస్తున్నాయి. దాదాపు 150 కోట్ల నికర ఆస్తులు ఉన్న ఈ జంట, తమ ఆదాయాన్ని నాలుగై దేళ్లలోనే డబుల్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

# సినిమా..

## నారీ నారీ వాష్ రూమ్ వార్ హైలైట్



రెండు జంటలు.. వారి మధ్య మకతిక ప్రేమకథలతో బాలీవుడ్ లో చాలా సినిమాలొచ్చాయి. హిందీ చిత్రసీమ స్ఫూర్తితో తెలుగులోను కొన్ని సినిమాలు తెరకెక్కించి దర్శకులు ఘన విజయం సాధించారు. అమ్మాయిఅబ్బాయి, ఆమధ్యలో ప్రవేశించే మరోఅమ్మాయి లేదా అబ్బాయి కథల్లో ఎప్పుడూ రొమాన్స్, కామెడీ హైలైట్ గానిలుస్తాయి. అలాంటి కథతోనే వచ్చింది సన్నీ సంస్కారికి తులసి కుమారి. ఈ చిత్రంలో యువతరం కథానాయకుడు వరుణ్ ధావన్-జాన్వీ- సన్యా మల్హోత్రా,రోహిత్ సరాఫ్..వీళ్ల మధ్యలో ప్రేమకథలు ఇంట్రెస్టింగ్ గానే ఉన్నా కానీ, కథ, కథనంలో కొత్తదనం లేకపోవడం అప్పటికే చూసేసిన ఫార్ములాతో సినిమాని నడిపించడంతో ఇది అంతంత మాత్రంగానే ఆ డుతోంది. ఈ చిత్రానికి శశాంక్ ఖైతాన్ దర్శకత్వం వహించారు.
అయి తే ఈ చిత్రంలో జాన్వీ కపూర్-సన్యా మల్హోత్ర ఒకరితో ఒకరు పోటీపడి నటించిన బాత్రూమ్ సీక్వెన్స్ సోషల్ మీడియాల్లో వైరల్ గా మారింది. ఒకరినొకరు డామినేట్ చేసేందుకు పోటీపడే భామలుగా ఇద్దరినటనా ఆకట్టుకుంది.. ఇలాంటి లైటర్ వెయిన్ ఎలిమెంట్స్ సినిమాకిప్లస్ అయినా కానీ ఇప్పుడున్న యువతరం ఇంకా ఏదో కావాలనికోరుకుంటారు. కానీదానిని ఇవ్వడంలో దర్శకుడు సఫలం కాలేదనివిశ్లేషణలు వెలువడుతున్నాయి. అమ్మాయి- అబ్బాయి మధ్య చిగురించే ప్రేమ,మధ్యలో ప్రవేశించే ఇతరులతో ఆకర్షణలు వెరసి నేటి జెన్ జెడ్ ప్రే మల్లో కన్ఫ్యూజన్ ని తెరపై చూపించారు.
ఈ చిత్రంలో సన్యా మల్హోత్రా, రోహిత్ సరాఫ్ ల నేచురల్ పెర్ఫామెన్స్ ప్రధాన ఆకర్షణ? ఇదొక టైమ్ పాస్ మూవీ. జాన్వీ ఇటీవలి కాలంలో ప్రయోగాత్మక సినిమాల్లో నటిస్తూనే, ఇలాంటి రొమాంటిక్ కామెడీల్లోను నటిస్తోంది. మునుముందు తెలుగులో -పెద్ది సినిమాతో అలరించనుంది. వరుణ్ ధావన్ భేధియా-2 లాంటి వైవిధ్యమైన చిత్రం చేస్తూనే, ఇప్పుడు రొమాంటిక్ కామెడీలను వదిలి పెట్టడం లేదు.

## బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో..




టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో పెద్ది సినిమా చేస్తున్నాడని తెలిసిందే. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. కాగా పెద్ది సెట్స్‌పై ఉండగానే రాంచరణ్ నయా ప్లాన్‌కు సంబంధించిన న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఇంతకీ విషయమేంటంటే రాంచరణ్ ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా ప్లాన్ చేసుకున్నాడట. ఇందులో భాగంగానే కేజీఎఫ్, సలార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో సినిమా చేసే అవకాశాలున్నాయని వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ లాంచ్ కంటే ముందు రాంచరణ్ చేతిలో చాలా సమయం ఉండనుండగా.. ఈ టైంలో పలువురు పాపులర్ డైరెక్టర్లతో కథా చర్చలు జరుపాలని నిర్ణయించుకున్నాడని ఫిలింనగర్ సర్కిల్‌లో న్యూస్ ఒకటి టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. అన్నీ అనుకున్నట్టు కుదిరితే రాంచరణ్ మరికొన్ని రోజుల్లో తన కొత్త ప్రాజెక్ట్‌పై ప్రకటన కూడా చేయబోతున్నాడని జోరుగా టాక్ నడుస్తోంది. రాంచరణ్ నటిస్తోన్న పెద్ది మార్చి 27న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీ విడుదలకు ముందే కొత్త సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేయాలనుకుంటున్నాడట రాంచరణ్. మరి ఇదే నిజమైతే రాంచరణ్ పెద్ది సినిమా అప్‌డేట్స్‌తోపాటు రానున్న రోజుల్లో కొత్త సినిమాలకు సంబంధించిన విషయాలను కూడా షేర్ చేసుకోబోతున్నాడన్నమాట. ఇక రాంచరణ్ అభిమానులకు పండగేనన్నమాట. రాంచరణ్ రంగస్థలం తర్వాత సుకుమార్‌తో మరో సినిమాకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే.

## ఆట పేరుతో బుక్కయిపోయిన ఆలియా



ఒకరితో ప్రేమలో ఉన్నాడని తెలిసీ ఆయువకుడిని ప్రేమిస్తానని, అతడినే ఇష్టపడతానని అంటే దాని అర్థం ఏమిటి? నైతికంగా తప్పుడు ప్రవర్తనగానే దీనిని భావిస్తారు. అయితే సిగ్గు విడిచి అలాంటి పనికి తాను సిద్ధమేనని ఒప్పుకుంది ఆలియా భట్. టూమచ్ విత్ ట్వింకిల్ అండ్ కాజోల్ షోలోమీరు ఇష్టపడతారా? అనే విచిత్రమైన విభాగంలో ఆలియా భట్ తన గుట్టును దాచుకోకుండా బయటపెట్టేసింది. ప్రస్తుతం ఈ ఇంట్రెస్టింగ్ క్లిప్ అంతర్జాలంలో వైరల్ అవుతోంది. వీడియో క్లిప్ చూడగానే ఆలియా భట్‌పై నెటిజనులు విరుచుకుపడుతున్నారు. గేమ్ షోలో ఆలియా వ్యాఖ్యానిస్తూ, తన స్నేహితురాలి మాజీతో ప్రేమలో పడతాను అనే ఆప్షన్ ని ఎంచుకుంది. ఇది నిజంగా కత్రినను మోసం చేయడమేనని కూడా జనం కామెంట్ చేస్తున్నారు. ఆ సమయంలో కాజోల్, వరుణ్ అందరూ ఆశ్చర్యపోయారు. గతంలో కత్రినతో రణబీర్ రిలేషన్ షిప్ లో ఉన్న సమయంలోనే ఆలియాతోను అతడు డేటింగ్ చేసాడనే పుకార్లు ఉన్నాయి. ఇప్పుడు మరోసారి ఆలియా కారణంగానే రణబీర్ తన ప్రియురాలు కత్రిన నుంచి విడిపోయాడు! అనే అర్థం వచ్చేలా వ్యవహారం కనబడటంతో నెటిజనులు ఆలియాపై విరుచుకుపడుతున్నారు.ఆలియా కారణంగానే రణబీర్ తనప్రేయసి కత్రినను మోసం చేసాడా?అంటూ ప్రశ్నిస్తున్నారు. అసలే ఆలియా కారణంగానే ఇలా జరిగిందని అప్పట్లో పుకార్లు ఉన్నాయి.. వాటిని ఇంకా ప్రజలు మర్చిపోకపోయినా, ఇప్పుడు ఆలియా నోరు జారడం కొంప ముంచింది.

## నాని టైర్-2 హీరోనా..?



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకు పోతున్న విషయం తెలిసిందే. వరుస హిట్స్ తో ఫుల్ జోష్ లో ఉన్న ఆయన.. ఇప్పుడు మరిన్ని సినిమాలతో బిజీగా ఉన్నారు. క్రేజీ ప్రాజెక్టులు తన లైనప్ లో చేర్చుకుంటున్నారు. రీసెంట్ గా హిట్-3తో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్న నాని.. అంతకుముందు హ్యాట్రిక్ సాధించారు. దసరా మూవీతో మంచి హిట్ సొంతం చేసుకున్న నేచురల్ స్టార్.. ఆతర్వాత హాయ్ నాన్న మూవీతో మెప్పించారు. మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. అనంతరం సరిపోదా శనివారంతో ఇంకో హిట్ ను సాధించారు. ఇప్పుడు హిట్-3తో వరుసగా నాలుగో విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ప్యారడైజ్ మూవీ లో నటిస్తూ బిజీగా ఉన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. నాని కెరీర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో రూపొందుతోంది. వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కానున్న ఆ మూవీపై ఇప్పటికే ఆడియన్స్ లో భారీ అంచనాలు ఉన్నాయి. రీసెం ట్ గా లీక్ అయిన నాని లుక్.. వాటిని మరింత పెంచింది. హైదరాబాద్ బ్యాక్ డ్రాప్ లో గ్యాంగ్ స్టర్ డ్రామాగా రూపొందనుంది. ఆ సినిమాతో కూడా హిట్ అందుకుంటారని అంతా అప్పుడే ఫిక్స్ అయిపోయారు. అదే సమయంలో టాలీవుడ్ టైర్-2 హీరోల్లో నాని ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకు న్నారు. అనేక విషయాల్లో నాని టాప్ లో ఉన్నారు. కొంతకాలంగా ఆయన నటిస్తున్న సినిమాలు అన్ని.. స్ట్రాంగ్ ఓపెనింగ్స్ సాధిస్తున్నాయి. బలమైన బాక్సాఫీస్ పుల్ ను చూపిస్తున్నాయి. ఓవర్సీస్ లో కూడా మిలియన్ డాలర్ మార్క్ క్రాస్ చేస్తున్నాయి. అక్కడ కూడా నానికి మంచి ఫ్యాన్‌బేస్ ఉంది. దీంతో ఆయన నటించిన సిని మాలు ఫారిన్ లో కూడా సాలిడ్ కలెక్షన్స్ సాధిస్తున్నాయి. ముఖ్యంగా నేచురల్ స్టార్ సినిమాలు మినిమమ్ గ్యారంటీ అంతా ఫిక్స్ అయ్యేలా క్రేజ్ సంపాదించుకున్నారు. వర్త్ బుల్ మూవీస్ అనేలా స్టాంప్ వేసుకున్నారు. అదంతా ఆయన స్క్రిప్ట్ సెలక్షన్ వల్లే అని చెప్పాలి. ఎందుకంటే ప్రేక్షకులు భావోద్వేగపరంగా కనెక్ట్ అయ్యే కథలు మాత్రమే నాని ఎంచుకుంటున్నారు. అటు కమర్షియల్ గా.. ఇటు కంటెంట్ బేస్డ్ గా సమతుల్యం చేసుకుంటున్నారు. ముఖ్యంగా యాక్టింగ్ తో మెప్పిస్తున్నారు.

## రష్మిక మరో బిగ్ స్టెప్..



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న కెరీర్ లో ఇప్పుడు ఓరేంజ్ లో దూసుకుపోతుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. వరుస సినిమాల్లో నటిస్తున్న అమ్మడు.. అదే సమయంలో హిట్స్ కూడా అలాగే అందుకుంటోంది. బ్లాక్ బస్టర్ సినిమాలతో అందరినీ మెప్పిస్తున్న రష్మిక.. మరిన్ని సినిమాల్లో ఛాన్స్ లు సొంతం చేసుకుని సత్తా చాటుతోంది. మొత్తానికి మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా బిజీగా ఉన్న ఆమె.. షూటింగ్స్ తో తీరిక లేకుండా గడుపుతుందనే చెప్పాలి. ఇప్పుడు సౌత్ టు నార్త్.. అనేక ఆఫర్స్ ఆమె చేతిలోనే ఉన్నాయి. అలా తక్కువ టైమ్ లో ఎక్కువ డబ్బులు సంపాదిస్తున్నట్లే ఉంది. అదే సమయంలో ఇప్పుడు రష్మిక మందన్న వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. ఆ విషయాన్ని ఆమెనే చెబుతూ పోస్ట్ చేసిన వీడియోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తొలుత ఓ వీడియో షేర్ చేస్తూ.. “నేను చివరకు దీన్ని రికార్డ్ చేస్తున్నానని నేను నమ్మలేకపోతున్నాను. మీకు ఇప్పటికే తెలిసినట్లుగా, నేను నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న దానిపై పని చేస్తున్నాను” అంటూ చెప్పుకొచ్చింది. “మీరు దానిని అనుభవిస్తారని నేను ఆశిస్తున్నాను, మీరు దానినిఇష్టపడతారని నేను ఆశిస్తున్నాను.దానినిమీతో పంచుకోవ డానికి వేచి ఉండలేను. చాలా చాలా చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఆందోళనగా ఉన్నాను. కృతజ్ఞతతో ఉన్నాను” అని చెప్పిన రష్మిక.. ఆ తర్వాత తన తల్లితో జరిగిన సంభాషణ వీడియోను పోస్ట్ చేసింది. అందులో రష్మిక “నేను ఇప్పుడు చాలాముఖ్యమైన షూట్‌కువెళ్తున్నాను. మీరు చెప్పిన వ్యాపారాన్ని నేను ప్రారంభిస్తాను” అని తల్లితో చెప్పగా.. ఆమె బెస్ట్ విషెస్ చెబుతారు. అయితే రష్మిక ఏ బిజినెస్ స్టార్ట్ చేయనుందో వెల్లడించలేదు. ప్రస్తుతం ఆమెకు సోషల్ మీడియాలో బెస్ట్ విషెస్ వెల్లువెత్తుతున్నాయి. బిజినెస్ లో కూడా సక్సెస్ అవ్వాలని అంతా కోరుకుంటున్నారు. కాగా, ఇప్పటికే అనేక మంది స్టార్ హీరోయిన్స్..సొంత ఫ్యాషన్ బ్రాండ్‌ను స్టార్ట్ చేసిన విషయం తెలిసిందే.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215